మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati
సంపుటి : 01 సంచిక :46 | శుక్రవారం , 17 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## నేటిమాట

"ఇతరుల చెడు గుణముల గురించి చర్చిస్తూ, నీ సమయాన్ని వృధా చేసుకోకు. అది నీకే విధంగాను ఉపయోగపడదు. "
-శ్రీరామకృష్ణపరమహంస



# కేటీఆర్‌పై ఈడీ ప్రశ్నల వర్షం



- 7 గంటల పాటు విచారణ
- ఏసీబీ అధికారులు 80 ప్రశ్నలు, ఈడీ అధికారులు 40 ప్రశ్నలు
- అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగారు
- ఓటుకు నోటుకు కేసులో రేవంత్ రెడ్డి దొరికిండు కాబట్టే నా మీద కూడా ఏసీబీ కేసు
- రేవంత్ రెడ్డి మీద ఈడీ కేసు ఉంది కాబట్టే నా మీద ఈ ఈడీ
- ఈ కారు రేసు నిర్వాహణలో పైసా అవినీతి జరగలేదు
- తప్పు చేసి ఉంటే రుజువు చేయండి.. ఏ శిక్షకైనా సిద్ధం

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఈడీ అధికారులు ఫార్ములా ఈ కారు రేస్ కేసులో విచారించారు. గురువారం 7 గంటల పాటు ప్రశ్నల వర్షం కురిపించిన తర్వాత ఆయన్ని వదిలేశారు. అయితే ఈడీ అధికారులు ఈకేసులో ఏసీబీ లేవనెత్తిన అంశాలపైనే ప్రశ్నలు వేసింది. కారు రేసు నిర్వాహణలో హెచ్‌ఎండీఏని పార్టనర్‌గా ఎందుకు చేర్చారనే విషయంతో పాటు ఇండియన్ కరెన్సీ రూ. 45కోట్ల ను పౌండ్లుగా మర్చి పంపడంపై ఆరా తీసింది. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కేసు విచారణ ముగిసిన అనంతరం కేటీఆర్..మీడియాతో మాట్లాడుతూ తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని.. ఫార్ములా ఈ కారు రేసు నిర్వాహణలో పైసా అవినీతి జరగలేదని స్పష్టం చేశారు.

### ఈడీ విచారణలో కేటీఆర్ సమాధానం ఇదే..!

ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సుదీర్ఘంగా విచారించారు. గురువారం ఉదయం 10.40 నుంచి సాయంత్రం 5.30 దాకా కేటీఆర్‌ను ఈడీ అధికారులు విచారించారు. దాదాపు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన విచారణలో పలు అంశాలకు కేటీఆర్ వివరంగా సమాధానం ఇచ్చారు.ఈడి అడిగిన అన్ని ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం ఇచ్చారు. ఎన్నిసార్లు విచారణకు రమ్మన్న వస్తానని మీరు అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇస్తానని తెలిపారు.

### నీకు దమ్ముంటే లైడిటెక్టర్ పరీక్ష పెట్టు

ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో అరపైసా కూడా అవినీతి జరగలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తేల్చిచెప్పారు. ఈ వ్యవహారంలో చర్చించేందుకు నీకు దమ్ముంటే లైడిటెక్టర్ పరీక్ష పెట్టు అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. ఏసీబీ ఆఫీసు నుంచి తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.ఆయనకు ఉన్న అవగాహన, ఆయనకు ఉన్న పరిమితమైన జ్ఞానంతో ఇందులో ఏదో కుంభకోణం జరిగింది అని అనుకుంటున్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

### కేటీఆర్‌కు మరో షాక్

**- ఏస్ నెక్స్ట్ జెన్‌కు, గ్రీన్ కో ఎండీకు ఏసీబీ నోటీసులు**

ఫార్ములా ఈ రేసు కేసులో ఏసీబీ అధికారులు దూకుడుగా విచారణ జరుపుతున్నారు. తాజాగా ఏసీబీ అధికారులు కేసులో కీలకంగా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ అనే కంపెనీకి నోటీసులు జారీ చేశారు. ఈ కంపెనీ ఫార్ములా ఈ రేసు కు మొదటి సీజన్ కు స్పాన్సర్ గా వ్యవహరించారు. తర్వాత వైదొలగింది. అందుకే ప్రభుత్వం నుంచి స్పాన్సర్ షిప్ ను చెల్లించాల్సి వచ్చింది.

2లో

# బస్తర్‌లో ఎన్‌కౌంటర్..

**12 మంది మావోయిస్టులు మృతి**



ఛత్తీస్‌గఢ్,16 జనవరి ( క్రాంతి న్యూస్ )ఛత్తీస్‌గఢ్‌లో ఈమధ్య ప్రతిరోజూ పోలీసులు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారు. ఈక్రమంలోనే అనేక మంది మావోలు ప్రాణాలు కోల్పోతున్నారు. నాలుగు రోజుల క్రితమే బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సలైట్లు సహా ఐదుగురు మావోలు ప్రాణాలు కోల్పోగా.. ఈరోజు మళ్లీ జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది మావోయిస్టులు హతం అయ్యారు. ఈ ఘటన జరగడానికి కొన్ని గంటల ముందే బీజాపూర్ జిల్లాలో నక్సల్స్ దాడి చేశాడు. ఈ ఐఈడీ పేలుడులో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

2లో

## సైఫ్ అలీ ఖాన్ మీద దాడి...

**బలమైన కత్తిపోట్లు**



2లో

ముంబైలో జరిగిన ఒక ఘటన గురువారం ఉదయం హిందీ సినిమా ఇండస్ట్రీ అంతా ఉలిక్కిపడేలా చేసింది. ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్ మీద దాడి జరిగింది. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్, స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ దంపతులు ముంబైలోని బాంద్రాలో నివాసం ఉంటున్నారు.

**తెలంగాణలో మేం ఇచ్చిన గ్యారెంటీలు**

# అమలు చేస్తున్నాం

**: సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్,16 జనవరి ( క్రాంతి న్యూస్ )ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలకు సంబంధించి పోస్టర్లను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. దిల్లీలో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో ఇచ్చిన హామీలను తాము నెరవేర్చుతున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు.తెలంగాణలో తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని, తాము ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు.




2లో

# ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్..

**8వ వేతన సంఘం ఏర్పాటుకు ఆమోదం**

న్యూ ఢిల్లీ,16 జనవరి ( క్రాంతి న్యూస్ )ప్రభుత్వ ఉద్యోగులకు అదిరే శుభవార్త అందింది. 8వ వేతన సంఘం ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం ముద్ర వేసింది. ఈ మేరకు కేంద్రం మంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. 8వ వేతన సంఘం ఏర్పాటు చేసిన తర్వాత తమ తుది నివేదికను 2026లో సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో గురువారం సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం ఈ మేరకు 8వ పే కమిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ వేతన సంఘం సిఫార్సులు అమలులోకి వస్తే ఉద్యోగుల జీతాలు భారీగా పెరగనున్నాయి.



2లో

## ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో

# బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు

న్యూ ఢిల్లీ,16 జనవరి ( క్రాంతి న్యూస్ ):బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు చేసింది. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 9 నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది.

2 లో



# తెలంగాణకే దిక్కులేదు..



## ఢిల్లీ కాంగ్రెస్ హామీలకు రేవంత్ గ్యారంటీనా!?

**(మమతా రెడ్డి - జర్నలిస్ట్)**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఉనికిని వెదుక్కొంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందట నవ్వుల పాలయ్యే ప్రయత్నాలు మానడం లేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే 300 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని గ్యారంటీ ఇచ్చారు. ఆ గ్యారంటీల అమలుకు తనది గ్యారంటీ అని కాంగ్రెస్ పార్టీ కొత్త ఆఫీస్ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకో గ్యారంటీ ఇచ్చారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న తెలంగాణలోనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలకు దిక్కులేదు. అలాంటిది ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ గెలిపిస్తే హస్తం పార్టీ అక్కడ గ్యారంటీల అమలుకు రేవంత్ రెడ్డి గ్యారంటీ ఇవ్వడం అంటే హాస్యాస్పదం కాకుండా ఇంకేమిటి? కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. తమ పార్టీని గెలిపించిన వంద రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని ప్రకటించారు. ఆరు గ్యారంటీల్లో మొదటి హామీ మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం. 13 నెలలు గడిచినా అతీగతీ లేదు.

5లో

## కేటీఆర్ విచారణ.. ఢిల్లీ చేరుకున్న హరీశ్ రావు



5లో




3లో

**సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన..**



7లో

**టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కొటక్..?**



7లో

**ఆర్ ఏజెన్సీలను బ్యాన్ చేయాలి..**

**బీసీసీఐకి హర్షా భోగ్లే రిక్వెస్ట్..!**



4లో

**ఏపీలో అమిత్ షా పర్యటన**



4లో

**ఎపి ఎస్ ఆర్టీసీకి భారీ లాభాలు..**

# ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు

మొదటి పేజీ తరువాయి

మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని కోర్టుకు బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టును బీఆర్ఎస్ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు వచ్చిందని గుర్తు చేసింది. మేఘా చంద్ర కేసు తీర్పుకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని బీఆర్ఎస్ తెలిపింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది.




# బస్తర్‌లో ఎన్‌కౌంటర్..

## 12 మంది మావోయిస్టులు మృతి

మొదటి పేజీ తరువాయి

ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ ప్రాంతంలో గురువారం రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పూజారీ కాంకేర్, మారేడుబాక ప్రాంత అడవుల్లో ఈరోజు ఉదయం 9 గంటల నుంచి దాడులు జరుగుతున్నాయి. ఓవైపు పోలీసులు మరోవైపు మావోయిస్టులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. కాల్పులకు తెగబడుతున్నారు. ముఖ్యంగా ఈ దాడికి కంటే కొన్ని గంటల ముందే నక్సలైట్లు జవాన్లపై దాడికి పాల్పడ్డారు.

రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఐఈడీ పేలుడులో ఈరోజు ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఈ ఘటనపై స్పందించిన డిప్యూటీ సీఎం విజయ్ శర్మ.. బీజాపూర్ నక్సల్స్ దాడిని పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఆ తర్వాతే పోలీసులు మావోలపై కాల్పులు జరిపారు. ఈ నెలలో ఇది రెండో ఎన్‌కౌంటర్. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మొత్తం 17 మంది నక్సలైట్లు చనిపోయారు.

మూడు జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్, ఐదు బెటాలియన్ల సీఆర్పీఎఫ్, కోబ్రా, సీఆర్పీఎఫ్ 229వ బెటాలియన్ బలగాలు.. నక్సల్స్ ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటూ కాల్పులు జరుపుతున్నారు. అయితే నాలుగు రోజుల క్రితమే అంటే జనవరి 12వ తేదీన జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టులతో పాటు ఐదుగురు నక్సలైట్లు మరణించారు.

అంతేకాకుండా ఇదే నెల 6వ తేదీన మావోయిస్టుల కోసం గాలిస్తున్న డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్జీ) వాహనాన్ని నక్సల్స్ మందుపాతర పెట్టి పేల్చారు. ఈ ఘటనలో మొత్తం 8 మంది జవాన్లు సహా ఓ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు. 2026 మార్చి నాటికల్లా నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించినప్పటి నుంచి రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోలీసులు కాల్పులు జరుపుతున్నారు.

# కేటీఆర్‌పై ఈడీ ప్రశ్నల వర్షం

మొదటి పేజీ తరువాయి

తనను ఎన్ని సార్లు విచారణకు పిలిచినా వస్తానని..ఇదే విషయాన్ని చెబుతానని తెలిపారు. కేవలం ఏదో విధంగా తనపై కేసులు పెట్టాలని.. ప్రభుత్వం అనవసరంగా డబ్బు ఖర్చు చేస్తోందని..అదే డబ్బుతో సంక్షేమపథకాలు అమలుకు ఖర్చు చేయాలని సూచించారు. ఇక తాను లై డిటెక్టివ్ టెస్టుకు కూడా సిద్ధమని చెప్పారు కేటీఆర్కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తనపై కుట్రపన్నుతోందని ఆరోపించారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్. అందుకే ఫార్ములా ఈ కారు రేసు పేరుతో అవినీతి జరిగిందని తప్పుడు కేసులు పెట్టించి దర్యాప్తు సంస్థలైన ఏసీబీ, ఈడీలతో విచారించి జైల్లో పెట్టాలని చూస్తోందన్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో నిర్వహించిన ఫార్ములా ఈ కారు రేసు పూర్తిగా ఫెమా నిబంధనల్ని ఉల్లగించినట్లుగా ఏసీబీ భావిస్తూ కేసు నమోదు చేసింది. ఇందులో ఏ1గా కేటీఆర్‌ని చేర్చింది. ఈడీ కూడా ఇదే కేసులో గురువారం కేటీఆర్‌ను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు విచారించింది. మధ్యలో లంచ్ గ్యాప్ మాత్రమే ఇచ్చిన అధికారులు నగదు బదిలీ ఎలా చేశారని..ప్రశ్నించారు. అలాగే హెచ్ఎండీఏని ఎందుకు భాగస్వామిగా చేర్చుకున్నారని ప్రశ్నలపై ప్రశ్నలు వేశారు.

## వేసిన ప్రశ్నలే వేసి..

సుమారు 7గంటలకుపైగా కేటీఆర్‌ను ఈడీ ప్రశ్నించింది. రూ.45 కోట్ల నగదును పౌండ్లుగా మార్చి పంపడంపై ప్రశ్నించారు. అదే విధంగా రెండో సీజన్ ఏస్ నెక్స్ట్ తప్పుకోవడానికి కారణం ఏమిటో చెప్పాలని నిలదీశారు. క్యాబినెట్ నిర్ణయం తీసుకోకుండా.. ఇంత పెద్ద మొత్తంలో నగదు బదిలీతో పాటు ఏకపక్ష నిర్ణయం తీసుకోవడానికి కారణాలు చెప్పాలని ప్రశ్నలు వేశారు. అయితే ఈవిచారణలో ఈడీ కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తుందనే అంత ఉత్కంట క్రియేట్ అయిన తర్వాత ఆయన్ని విచారణ ముగించి పంపించారు. అయితే ఈడీ ఆఫీస్ నుంచి బయటకొచ్చిన కేటీఆర్ ఇందులో ఎలాంటి కొత్త విషయం లేదని..ఏసీబీ అడిగిన ప్రశ్నలే ఈడీ అధికారులు అడిగారని చెప్పారు.

ఫార్ములా ఈ కారు రేసు నిర్వాహణలో పైసా అవినీతి జరగలేదని.. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పానని..ఇప్పుడే కాదు ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని తెలిపారు. అవసరమైతే లై డిటెక్టివ్ పరీక్షకు కూడా తాను రెడీ అని చెప్పారు. ఇదంతా కేవలం తనపై కుట్రపూరితంగా సీఎం రేవంత్ రెడ్డి బనాయిస్తున్న కేసులు తప్ప ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదన్నారు. నిరూపించమని ప్రభుత్వానికి సవాల్ విసిరారు కేటీఆర్.

## 40 ప్రశ్నలు

ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ అధికారులు 80 ప్రశ్నలు, ఈడీ అధికారులు 40 ప్రశ్నలు అడిగారు.. అన్నింటికి సమాధానం చెప్పానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగారని కేటీఆర్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్‌లో ఈడీ విచారణ ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

ఓటుకు నోటుకు కేసులో అడ్డంగా ఏసీబీకి రేవంత్ రెడ్డి దొరికిండు కాబట్టే నా మీద కూడా ఏసీబీ కేసు పెట్టిచ్చిండు. రేవంత్ రెడ్డి మీద ఈడీ కేసు ఉంది కాబట్టే నా మీద ఈ ఈడీ విచారణ జరిపిస్తున్నారు. అంతిమంగా నిజం, న్యాయం, ధర్మం నిజాయితీనే గెలుస్తుంది. భారత న్యాయవ్యవస్థ మీద, న్యాయమూర్తుల మీద నాకు విశ్వాసం ఉంది. ఇవాళ కాకుండా ఇంకో నాలుగు రోజులకైనా ప్రజలకు పూర్తి వాస్తవాలు తెలుస్తాయన్న విశ్వాసం నాకుంది అని కేటీఆర్ చెప్పారు.

8 గంటలు వాళ్లు అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగారు. తప్పు చేయలేదు.. అరపైసా అవినీతి జరగలేదు. తప్పు చేసి ఉంటే రుజువు చేయండి.. ఏ శిక్షకైనా సిద్ధమని అధికారులకు చెప్పాను. పారదర్శకంగా నిధుల బదిలీ జరిగింది ఇంకెక్కడ మనీ లాండరింగ్ అని ఏసీబీ, ఈడీ అధికారులను అడిగాను. ఇక్కడికి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీడియా మిత్రులకు అందరికీ ధన్యవాదాలు. నేను తప్పు చేయలేదు.. తప్పు చేయబోను. ఇందులో అర పైసా అవినీతి కూడా జరగలేదు అని కేటీఆర్ మరోసారి తేల్చిచెప్పారు.

# తెలంగాణలో మేం ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తున్నాం : సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో 55 వేల ఉద్యోగాలు కల్పించామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోందని, ఇప్పటి వరకు 120 కోట్ల జీరో టికెట్లతో మహిళలు ప్రయాణం చేశారనిపేర్కొన్నారు. దిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

దిల్లీలో తాము అధికారంలోకి వస్తే విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఏడాది పాటు నెలకు రూ.8,500 ఇస్తామని ప్రకటించింది. యువ ఉడాన్ యోజన కింద నిరుద్యోగులకు ఈ ఆర్థిక సాయం చేయడమే కాకుండాగ, వారి నైపుణ్యాలకు అనుగుణంగా కంపెనీల్లో పనిచేసేలా చేస్తామని చెప్పింది. అయితే ఇది ఇంట్లో కూర్చినే వారికి కాదని, వారి నైపుణ్యాలు ప్రదర్శించినవారికి డబ్బులు ఇస్తామని తెలిపింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆదివారం ఈ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం ద్వారా నిరుద్యోగులు వారి శిక్షణ పొందిన రంగంలో పనిలో చేరేలా ప్రయత్నిస్తామన్నారు. తద్వారా వారు వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకోగలరని సచిన్ పైలట్ అన్నారు.

ఇప్పటికే పలు జానాకర్షణ పథకాలను కాంగ్రెస్ ప్రకటించింది. ప్యారీ దీదీ యోజన కింద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని జనవరి 8న హామీ ఇచ్చింది. 'జీవన్ రక్షా యోజన' కింద రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను అందిస్తామని హామీ ఇచ్చింది. ఇదిలా ఉండగా, 70 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న దిల్లీలో పోలింగ్ ఫిబ్రవరి 5న జరుగుతుంది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

# సైఫ్ అలీ ఖాన్ మీద దాడి...

## బలమైన కత్తిపోట్లు

కట్టుదిట్టమైన సెక్యూరిటీ ఉండే ఆ ఇంటిలోకి గురువారం ఉదయం తెల్లవారుజామున ఒక అగంతకుడు చొరబడ్డాడు. సైఫ్ అలీ ఖాన్ మీద కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆయనకు గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు తెలిసింది.

గురువారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో ఘటన జరిగినట్లు తెలిసింది. పని మనిషితో ఎవరో గొడవ పడుతుంటే... సర్ది చెప్పడానికి సైఫ్ మధ్యలోకి వెళ్లారని, ఇద్దరి మధ్య గొడవలో ఇంటికి వచ్చిన అగంగతుకు సైఫ్ మీద దాడి చేశారని ప్రాథమిక సమాచారం అందుతోంది.

ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో సైఫ్ అలీ ఖాన్ చికిత్స పొందుతున్నారు. ఆయన మెడ వెనుక భాగంలో 10 సెంటీమీటర్ల లోతైన కత్తిపోటును గుర్తించారు. అలాగే, ఎడమ చేతి మీద బలమైన కత్తి గాటు కూడా ఉందట. ఆయన వీపు మీద బలంగా కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయమైందని సమాచారం అందుతోంది. ప్రస్తుతం సైఫ్ అలీ ఖాన్ కు సర్జరీ జరుగుతోందని లీలావతి ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఘటన జరిగిన సమయంలో కరీనా కపూర్, తైమూర్ ఇంటిలో లేరని తెలుస్తోంది.

మాజీ క్రికెటర్ మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, ఒకప్పటి బాలీవుడ్ అందాల తార షర్మిల ఠాగూర్ దంపతుల కుమారుడు సైఫ్ ఆలీ ఖాన్. పటౌడి వారసుడికి నటన మీద ఆసక్తి ఉండడంతో హిందీ సినిమాల్లోకి వచ్చారు. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన పాన్ ఇండియా సినిమా దేవరతో తెలుగు చిత్ర సీమకు సైఫ్ పరిచయం అయ్యారు. తనకంటే వయసులో పెద్దదైన అమృతతో ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నారు. సైఫ్ అమృత ఇద్దరు పిల్లలు... ఇబ్రహీం అలీ ఖాన్, సరే అలీ ఖాన్. సారా కథానాయకుల నటిస్తుండగా త్వరలో ఇబ్రహీం హీరోగా పరిచయం కావడానికి రెడీ అవుతున్నారు. అమృత విడాకుల తర్వాత కరీనాను పెళ్లి చేసుకున్నారు సైఫ్. వాళ్ళిద్దరికీ కలిగిన సంతానమే తైమూర్.

## ఇతనే సైఫ్ అలీ ఖాన్‌పై దాడి చేసింది - ఫోటో రిలీజ్ చేసిన ముంబై పోలీసులు

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ తన బాంద్రా అపార్ట్‌మెంట్‌లో కత్తిపోట్లకు గురైన కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేసతున్నారు గురువారం దాడి తర్వాత భవనం మెట్ల నుండి దాడికి పాల్పడిన వ్యక్తి పారిపోతున్న దృశ్యాలు CCTV ఫుటేజ్‌లో బయటపడ్డాయి. బాంద్రాలోని తన 12వ అంతస్తులోని అపార్ట్‌మెంట్‌లోకి ఖాన్‌పై దాడి చేసిన నిందితుడు, ఆరవ అంతస్తులోని భవనం మెట్ల నుండి బయటకు వస్తున్న సీసీ టీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగించేందుకు వీలుగా మెట్లు నిర్మించారు. వాటి ద్వారా అతను ఇంట్లోకి చొరబడినట్లుగా గుర్తించారు.

ఈ మెట్ల వెనుక చాలా బ్లైండ్ స్పాట్లు ఉన్నాయి. అంటే సీసీ కెమెరాలకు కూడా అందవు. అయితే ఆరో అంతస్తులో సీసీ టీవీ కెమెరాల్లో రికార్డ్ అయిన ఫుటేజ్‌ల నుండి పోలీసులు అతన్ని పోలీసులు గుర్తించగలిగారు. సైఫ్ ఇంట్లోకి దుండగుడు అత్యవసర అగ్నిమాపక ద్వారం ద్వారా ప్రవేశించాడని పోలీసులు గుర్తించారు. దొంగకు అది నటుల ఇల్లు అని తెలియకపోవచ్చునని.. దొంగతనం ఉద్దేశంతోనే ఇంట్లోకి వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. దుండగుడికి ఇంటి యజమాని ఎవరో తెలియదని పోలీసులు చెబుతున్నారు. అతని ఉద్దేశం బాగా ధనవంతుల ఇంట్లో దొంగతనం చేయడం కావొచ్చునని చెబుతున్నారు.

దుండగుగు సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి వచ్చిన తర్వాత ముందుగా పనిమనిషి గదిలోకి వెళ్లాడు. దాంతో పనిమనిషి కేకలు వేయడం ప్రారంభించింది. దీంతో ఏదో జరుగుతోందని సైఫ్ అక్కడికి వచ్చాడు. అందరూ మేలుకుటున్నారని తన దొంగతనం ప్లాన్ ఫెయిలయిందని..దొరికిపోతానన్న ఉద్దేశంతో ఎదురుగా వచ్చిన సైఫ్‌పై దాడి చేసి పారిపోయాడు. అతడిని పట్టుకునేందుకు సైఫ్ చేసిన ప్రయత్నంలోనే ఎక్కువగా గాయాలయినట్లుగా తెలుస్తోంది. పనిమనిషి చేతికి స్వల్ప గాయమైంది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వ్యక్తిపై %దీచీ% లోని సెక్షన్ 311, 312, 331(4), 331(6) మరియు 331(7) తో సహా అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సీసీ ఫుటేజీ లో దుండగుడు దృశ్యాలు నమోదు కావడంతో పోలీసులు అతన్ని పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. అతను ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తి అయి ఉంటాడని అనుమానిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్ దయానాయక్ కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్..

## 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు జీతభత్యాలు, కరువు భత్యం, పింఛన్ల వంటివి పే కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని తెలిసిందే. ప్రస్తుంత 7వ వేతన సంఘం అమలులో ఉంది. అయితే ఈ పే కమిషన్ ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తవుతున్న క్రమంలో 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలనే డిమాండ్లు పెరిగాయి. ఉద్యోగ సంఘాలు పలు సందర్భాల్లో కేంద్రానికి వినతులు పంపించారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 1, 2025 రోజున ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో దీనిపై ప్రకటన ఉంటుందని అంతా భావించారు. కానీ, అంతకున్నా ముందే కేంద్రం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

8వ వేతన సంఘం అమలైతే ఆ కమిషన్ సిఫార్సుల మేరకు ఉద్యోగుల జీతాలు, పెన్షన్, ఇతర ప్రయోజనాలు భారీగా పెరుగుతాయని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, కొన్ని రోజులుగా వేతన సంఘం స్థానంలో కొత్త వ్యవస్థను తీసుకొచ్చేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందన్న వార్తలు సైతం వచ్చాయి. కానీ, వాటన్నింటిని తోసిపుచ్చుతూ 8వ వేతన సంఘానికి ఆమోదం తెలిపింది. 8వ పే కమిషన్ అమలులోకి వస్తే ఉద్యోగుల కనీస వేతనం రూ.34 వేలకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కనీస పెన్షన్ సైతం రూ.17 వేలపైన అందుతుందని తెలుస్తోంది.

7వ వేతన సంఘం 2016లో అమలులోకి వచ్చింది. పే బ్యాండ్స్, గ్రేడ్ పే వంటి వాటి స్థానంలో సింప్లిఫైడ్ పే మ్యాట్రిక్ అమలులోకి తీసుకొచ్చారు. కనీస వేతనం నెలకు రూ.18 వేలు చేశారు. కేబినెట్ సెక్రటరీ స్థాయికి గరిష్ఠంగా నెలకు రూ. 2.50 లక్షల వేతనం నిర్ణయించారు. బేసిక్ పే పైన 2.57 రెట్లు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఇస్తున్నారు. గ్రాట్యుటీ పరిమితి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు ఇటీవలే పెంచారు. ఇక ద్రవ్యోల్బణం ఇండెక్స్ ఆధారంగా డీఏ అమలు చేస్తున్నారు. ప్రస్తుతం డీఏ 53 శాతంగా ఉంది.

# కేటీఆర్‌కు మరో షాక్

## - ఏస్ నెక్స్ట్ జెన్‌కు, గ్రీన్ కో ఎండీకు ఏసీబీ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

ఏస్ నెక్స్ట్ జెన్ తో పాటు గ్రీన్ కో ఎండీ అనిల్ చలమలశెట్టికి నోటీసులు జారీ అయ్యాయి. ఈ నెల 18న విచారణకు కావాలని నోటీసుల్లో పేర్కొంది.

ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్ సహా అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ విచారించింది. ఇప్పుడు అనిల్ చలమలశెట్టికి కూడా నోటీసులు ఇవ్వడంతో ఈ కేసును కొలిక్కి తెచ్చేందుకు ఏసీబీ దర్యాప్తు దూకుడుగా జరుపుతోంది. గ్రీన్ కో కంపెనీకి ఏస్ నెక్స్ట్ జెన్ సబ్సిడరీ కంపెనీ. ఇప్పటికే ఈ కేసులో ఆ సంస్థల ఆఫీసుల్లో సోదాలు నిర్వహించారు. కంపెనీ ఏర్పాటు వెనుక ఉద్దేశాలు..స్పాన్సర్ షిప్ నుంచి తప్పుకోవడం అదే సమయంలో బీఆర్ఎస్ కు ఎలక్టోరల్ బాండ్లు ఇవ్వడం తదితర అంశాలపై ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. త్వరలో కేటీఆర్ కు కూడా మరోసారి నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈడీ విచారణ తర్వాత ఏసీబీ అధికారులు కేటీఆర్కు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

కేటీఆర్ ను అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి సమక్షంలో విచారించాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో అర్వింద్ కుమార్ అప్రూవర్ గా మారతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సుదీర్ఘ సర్వీస్ ఉన్న తాను.. నిబంధనలకు విరుద్ధంగా ఏమీ చేయలేదని అంతా కేటీఆర్ చెప్పినట్లుగానే చేశానని.. చెబుతున్నారు. అదే క్రమంలో జరిగిన వివరాలన్నీ చెబుతానని తనను అరెస్టు చేయవద్దని ఆయ కోరుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో డబ్బులు చెల్లించక ముందు ఎలాంటి ఒప్పందం లేదు. డబ్బులు చెల్లించిన తర్వాతనే ఒప్పందాలు చేసుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఏస్ నెక్స్ట్ జెన్ స్పాన్సర్ షిప్ ఉపసంహరించుకోవడం కూడా కుట్రపూరితం అన్న అనుమానాలు రావడంతో ఆ దిశగా కూడా ఏసీబీ దర్యాప్తు జరుపుతోంది. ఎఫ్ఐఆర్ ను క్వాష్ చేసేందుకు సుప్రీంకోర్టు కూడా నిరాకరించడంతో కేటీఆర్ ను అరెస్టు చేయడానికి ఎలాంటి ఆటంకాలు లేవు. అయితే ఈ వ్యవహారంలో అందర్నీ పూర్తి స్థాయిలో ప్రస్నించిన తర్వాతనే అరెస్టుల గురించి ఏసీబీ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# ఈడీ విచారణలో కేటీఆర్ సమాధానం ఇదే..!

మొదటి పేజీ తరువాయి

భారత రాజ్యాంగం పైన, దేశ న్యాయవ్యవస్థ పైన తనకు అపారమైన గౌరవం ఉన్నదని కేటీఆర్ తెలియజేశారు. ఈరోజు ఈడీకి రెండు డాక్యుమెంట్లను (ఫార్ములా-ఈ పైన నీల్సన్ సంస్థ రూపొందించిన నివేదిక, తెలంగాణ ఈవీ పాలసీ - 2020) ఇచ్చి కేటీఆర్ రిసిప్ట్ తీసుకున్నారు.

ఫార్ములా ఈ రేసు అనంతరం స్వతంత్ర సంస్థ నీల్సన్ రూపొందించిన నివేదికను ఈడీ అధికారులకు కేటీఆర్ అందజేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 82 మిలియన్ డాలర్ల మేర ఆర్థిక లబ్ధి జరిగిందని నీల్సన్ సంస్థ తెలిపినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. దీంతోపాటు అప్పటి ప్రభుత్వం 2020 అక్టోబర్ నెలలో ప్రకటించిన తెలంగాణ ఎలక్ట్రిక్ పాలసీ కాపీని కూడా కేటీఆర్ విచారణ అధికారులకు అందజేశారు. దీని ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేసి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులతోపాటు మొబిలిటీ రంగంలో తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దే ఒక గ్రాండ్ విజన్, ఎజెండాతో పెట్టిన తెలంగాణ ఈవీ పాలసీ అని కేటీఆర్ సవివరంగా తెలిపారు.


ఈవీ పాలసీ స్ఫూర్తిలో భాగంగానే తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాల పైన ఒక దీర్ఘకాల ఎజెండాతో ఈ రేసును నిర్వహించినట్లు కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఫార్ములా ఈ రేసు వలన రాష్ట్రంతో పాటు దేశానికి కూడా లాభం జరిగిందని, తద్వారా దేశ ప్రతిష్ట పెరిగిందని కేటీఆర్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పూరి, నితిన్ గడ్కరీ, అనురాగ్ ఠాకూర్, కిషన్ రెడ్డి వంటి కేంద్ర మంత్రులు కూడా ఈ రేసులో పాల్గొన్నట్లు తెలిపారు కేటీఆర్.

ఈ మొత్తం వ్యవహారంలో కేవలం సాంకేతిక అంశాలే మినహా.. ఎక్కడ పైసా అవినీతి కానీ, మళ్లింపు కానీ జరగలేదు. ప్రభుత్వం సొమ్ములు ఇక్కడి నుంచి ఫార్ములా-ఈ సంస్థకు చేరిన రికార్డులని స్పష్టంగా ఉన్నాయి. ఇక్కడి నుంచి వెళ్ళిన పూర్తి డబ్బులు సంస్థ వద్ద ఉన్నప్పుడు ఇందులో అవినీతి లేనేలేదని కేటీఆర్ ప్రస్తావించారు. ఈడీ విచారణ సందర్భంగా మరికొన్ని వివరాలు అధికారులు అడిగారు. కేటీఆర్ వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్, ఆస్తుల వివరాలు అడిగారు. వాటికి సంబంధించిన వివరాలన్నీ అందిస్తానని విచారణ అధికారులకు కేటీఆర్ తెలిపారు.

# నీకు దమ్ముంటే లైడిటెక్టర్ పరీక్ష పెట్టు

మొదటి పేజీ తరువాయి

పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగనే కనబడ్డట్టు.. రేవంత్ రెడ్డి లాంటి దొంగకు అన్నింట్లో కూడా దొంగతనం జరుగుతది.. అన్నింట్లో పైసలు తింటరనే దిక్కుమాలిన ఆలోచన ఉండొచ్చు కానీ.. నేను ఒక్క పైసా అవినీతి చేయలేదు. నేను మళ్లీ చెబుతున్నా. రేవంత్ రెడ్డి గారు మీరు రేపు రండి.. లేదంటే మీరు మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు రమ్మంటే వస్తా. ఇద్దరం కూర్చుందాం.. నువ్వు లై డిటెక్టర్ పెట్టు. ఓపెన్ లైవ్ కెమెరాలు పెట్టుండ్రి. నేను మాట్లాడుతా.. నువ్వు మాట్లాడు. ఎవడు దొంగనో.. ఎవడు దొరనో.. రాష్ట్ర ప్రజలు, దేశ ప్రజలు చూస్తరు. తేల్చుకుందాం.. పాపం ఈ బంద్ కెమెరాల్లల అధికారులను చంపుడు.. వాళ్లను సతాయించుడు ఎందుకు.. నువ్వు లైడిటెక్టర్ పరీక్ష పెట్టు.. తప్పకుండా వస్తాను అని కేటీఆర్ స్పష్టం చేశారు.






# అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు



ఖమ్మం, 16 జనవరి (క్రాంతి న్యూస్ ): మార్కెట్ లో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ఖమ్మం పత్తి మార్కెట్ యార్డులో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, వ్యవసాయ మార్కెట్ యార్డులో రాత్రి జరిగిన సంఘటన దుం`దృష్టకరమని, దీనికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ప్రస్తుతం పోలీసుల విచారణలో ఉందని అన్నారు. ప్రమాదంలో పత్తి బేల్లు తగల బడుతున్నాయని తెలిసిన వెంటనే నష్ట నివారణ చర్యలకు ఆదేశించామని, 10 నిమిషాలలో ఫైర్ ఇంజన్ రావడం వల్ల ప్రమాద విస్తృతి తగ్గిందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాల నివారణకు, ప్రమాదం ఎందుకు జరిగిందో కారణాలు తెలుసుకోవాల్సి ఉందని, మార్కెట్ లో ఉన్న భద్రత ఏర్పాట్లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైన నివేదికను ప్రభుత్వానికి అందించాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కెట్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు 100 కోట్ల రూపాయలతో ఆధునీకరణ పనులు ప్రారంభిస్తామని, త్వరలోనే ఆ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు. మార్కెట్ కు చుట్టూ ఉండే రోడ్లు విశాలంగా, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉండాలని, మన మార్కెట్ పూర్తి స్థాయిలో పరిశు భ్రంగా ఉండాలని అన్నారు. హైదరాబాద్ లో వెయ్యి కోట్లు గాని, రెండు వేల కోట్లు గాని ఖర్చు పెట్టి మెగా మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం ఆలోచిస్తుందని, విమానాశ్రయం దగ్గరలో ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్ మధ్యలో 400 ఎకరాలలో ఈ మార్కెట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి పెద్ద పెద్ద మార్కెట్ లు అభివృద్ధి చేసేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామని, రైతులకు వ్యాపారులకు సౌకర్యంగా ఉండే విధంగా, ఎవరు నష్టపోకుండా ఉండే విధంగా కొత్త మార్కెట్ నిర్మాణం ఉంటుందని అన్నారు. నూతన మార్కెట్ అందుబాటులోకి వచ్చేలోగా మిర్చి పంటను పత్తి మార్కెట్లో కూడా అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. గతంలో సిద్దారెడ్డి కళాశాల ఉండే ప్రదేశంలో పత్తి మార్కెట్, పక్కన కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని ప్రస్తుతం ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ మిర్చి ఘాటు అధికంగా అయినందున మద్దులపల్లిలో కొత్త మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఖమ్మం ప్రజలకు, రైతులకు, వ్యాపారులకు అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, అగ్ని ప్రమాదానికి గల కారణాలను కనిపెట్టి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మార్కెట్ నిర్మాణం కలెక్టర్ నిరంతరం పర్యవేక్షించాలని, వర్షాకాలంలోపు మార్కెట్ కు స్వరూపం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు, ట్రేడర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన..

## పూర్తి షెడ్యూల్ ఇదే



హైదరాబాద్,16 జనవరి ( క్రాంతి న్యూస్ )తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లనున్నారు. సింగపూర్, స్విట్జర్లాండ్‌లలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 24 హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఇలా ఉంది.. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాత్రి 9.30 గంటలకు సింగపూర్‌కు బయలుదేరి వెళతారు. శుక్రవారం ఉదయం సింగపూర్‌కు చేరుకుంటారు. జనవరి 17 నుంచి జనవరి 19 వరకు మూడు రోజుల పాటు సింగపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం పర్యటిస్తుంది. సింగపూర్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ఏర్పాటైన క్రీడా విశ్వవిద్యాలయాలు, స్టేడియాలను పరిశీలించనున్నారు.

జనవరి 20వ తేదీన సింగపూర్ నుంచి స్విట్జర్లాండ్‌కు బయలుదేరుతారు. జనవరి 20వ తేదీ ఉదయం 6.10 గంటలకు స్విట్జర్లాండ్‌కు చేరుకుంటారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ అధికారులు కూడా దావోస్‌లో పర్యటించనున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతిష్టాత్మక వార్షిక సమావేశంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి టీమ్.. ఈ సదస్సుకు హాజరయ్యే పలు పారిశ్రామికవేత్తలతో చర్చించి రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించనుంది. హైదరాబాద్‌ను భవిష్యత్ నగరంగా ప్రదర్శించడానికి, గణనీయమైన పెట్టుబడులను పొందేందుకు అంతర్జాతీయ వేదికను ఉపయోగించుకోవాలని రేవంత్ రెడ్డి బృందం ఆలోచిస్తుంది.

దావోస్ పర్యటన ముగించుకుని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం.. జనవరి 23 మధ్యాహ్నం 2.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రాత్రి 11.45 గంటలకు దుబాయ్‌కు చేరుకుంటుంది. జనవరి 24 తెల్లవారుజామున 3.30 గంటలకు దుబాయ్ నుంచి బయలుదేరి ఉదయం 8.25 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

# ప్రజా పోరాటంతోనే ఏదైనా సాధించవచ్చు

**- కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ చైర్మన్ కొదమసింహం పాండురంగ చార్యులు**

చంద్రుగొండ,16 జనవరి (క్రాంతి న్యూస్ ):ఎన్నో ఏళ్ల నాటినుండి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కలలు కన్న కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి ప్రజలు చేసిన పోరాటం ఫలించిందని. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ లోని కొండపల్లి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం వరకు నూతన రైల్వే లైన్ నిర్మాణం కొరకు మరో అంకురార్పణ కు శ్రీకారం చుట్టడం జరిగిందని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ చైర్మన్ కొదమసింహం పాండురంగ చార్యులు అన్నారు. గురువారం చంద్రుగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన అఖిలపక్ష నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భద్రాచలం రోడ్ కొవ్వూరు నూతన రైల్వే లైన్ నిర్మాణం కోసం 54 ఏళ్లగా అఖిలపక్ష నాయకులతో కలిసి చేసిన పోరాటం, రెండు రాష్ట్రాల ప్రజల కృషి, నేడు కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి పనులు ప్రారంభించిందన్నారు. ఇది ఏ ఒక్కరి విజయం కాదని ఇది అందరి విజయమన్నారు. ఈ రైల్వే నిర్మాణం కోసం 16 సార్లు ఢిల్లీకి వెళ్లి ఢిల్లీలో ఉన్న కేంద్ర మంత్రులను, ఎంపీలను, కలవడం జరిగిందన్నారు. అయినా కూడా ఫలితం లేకపోవడంతో తానే స్వయంగా కొత్తగూడెం నుంచి కొవ్వూరు వరకు పాదయాత్రకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ పాదయాత్రకు రెండు రాష్ట్రాల ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. దాని ఫలితమే 2014లో తమ ఉద్యమం కేంద్ర ప్రభుత్వంలోని ఎల్లో బుక్కులో ఎంట్రీ అయిందన్నారు. దీని ద్వారానే 2024 లో కొవ్వూరు లైన్ కు నిధులు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ ఉద్యమానికి చంద్రుగొండ లో ఉన్న అన్ని పార్టీల నాయకులు కూడా తనకు సహాయ సహకారాలు అందించడంతోపాటు తన ఉద్యమంలో అడుగులో అడుగై తన వెంట నడిచారన్నారు. అదే స్ఫూర్తితోనే నేడు కొండపల్లి, చంద్రుగొండ, రైల్వే లైన్ నిర్మాణం కొరకు చంద్రుగొండ లోనే మలిదశ పోరాటానికి అంకురార్పణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం వల్ల ఎంతోమందికి జీవన ఉపాధితో పాటు, 5 రాష్ట్రాలకు ప్రయాణ దూరం తగ్గటంతో ప్రయాణికులకు మేలు జరుగుతుందన్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్, కృష్ణ, జిల్లాలోని తిరువూరు, కఠంపాడు, ఏ కొండూరు, మైలవరం, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెనుబల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, మండలాల్లో పర్యటించి రైల్వే లైన్ నిర్మాణం గురించి వివరించి అన్ని పార్టీలను కలుపుకొని కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాష్ట్రాల ముఖ్యమంత్రులను, అలాగే ఉపముఖ్యమంత్రులను, మంత్రులను కూడా కలిసి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతామన్నారు.



# కుస్తీ విజేత అబ్జల్ ఖాన్

జైనూర్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రంలో ప్రతి ఏటా శ్రీ జగదాంబ దేవి మహా జాతర నిర్వహిస్తారు.జాతర లో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు.గురువారం కుస్తీ పోటీలు హెూరాహెూరీగా కొనసాగాయి.పోటీల్లో తలపడేందుకు మహారాష్ట్ర, పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి భారీగా మల్లయోధులు పాల్గొన్నారు. నువ్వా నేనా అంటూ తలపడిన మల్లయోధులను ప్రజల కేరింతలు, చప్పట్లు, డప్పు మోతలతో ప్రోత్సహించారు. రూ.11 బహు మతితో మొదలైన పోటీలు రూ.2,500 వరకు గెలుపొందిన వారికి జాతర కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందించారు. విజేతగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల ఫారిది లోని ఇలియస్ నగర్ కు చెందినా అబ్జల్ ఖాన్ నిలిచారు.



# ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల ఫలాలు అందాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



జైనూర్ ,16 జనవరి (క్రాంతి న్యూస్ ):జిల్లాలో అర్హత గల ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించే విధంగా అధికారులకు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని జైనూర్ మండలం ఊషెగాం గ్రామంలో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేలో భాగంగా వ్యవసాయ భూములను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, రేషన్ కార్డులు ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా జాబితా రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు ద్వారా జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుదారులలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జాబితాను రూపొందించాలని తెలిపారు. రైతు భరోసా పథకానికి అర్హులైన వారి జాబితా తయారు చేయాలని, వ్యవసాయ అధికారులు రూపొందించిన జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు పథకాల వారీగా అధికారులను నియమించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అమలు చేయాలి

**- మండల ప్రత్యేక అధికారి సంజీవరావు**




చంద్రుగొండ,16 జనవరి (క్రాంతి న్యూస్ ):ప్రభుత్వ పథకాలను అర్హత కలిగిన లబ్ధిదారులకు పారదర్శకంగా అమలు చేయాలని చంద్రుగొండ మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. గురువారం చంద్రుగొండ రైతు వేదికలో ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సూచనలను అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ పథకాలు అమలుకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు అవసరమైన గ్రామసభలను పకడ్బందీగా, జవాబుదారీతనం గా నిర్వహించాలని ఆయన సూచించారు. పథకాల అమలు కోసం నేటి నుంచి ఫీల్డ్ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి ఈనెల 21 నుంచి 23 తేదీ లోపు అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసే ఈ నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలు. గ్రామసభల ఆమోదం పొందవలసి ఉంటుందన్నారు. పై పథకాలను ఈనెల 26న ప్రారంభించడానికి సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాలుగు పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రతి ఒక్కరికి జవాబుదారీతనంగా ఉంటూ అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి సంధ్యారాణి ఎంపీడీవో బయ్యారపు అశోక్, డిప్యూటీ తహశీల్దార్ ఎల్ ప్రసన్న, మండల వ్యవసాయ శాఖ అధికారి జి వినయ్, అన్ని శాఖల ఏఈఓలు, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓ లు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఏపీలో అమిత్ షా పర్యటన

## మోదీ వచ్చిన 10 రోజుల గ్యాప్‌లోనే.. బాబుతో ప్రత్యేక భేటీ, అందుకేనా..?



ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రమంత్రులు, బీజేపీ అగ్రనేతల పర్యటనలు కొనసాగుతున్నాయి. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించిన విషయం తెలిసిందే. విశాఖపట్నంలో పర్యటించిన ప్రధాని మోదీ.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కాగా.. ఆదివారం (జనవరి 19న) రోజున కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. ఏపీలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర బీజేపీ ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం (జనవరి 19న) కృష్ణా జిల్లాలోని గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్ , ఎన్ఐడీఎం () ప్రాంగణాలను అమిత్ షా ప్రారంభించనున్నారు.

ఈ పర్యటన కోసం శనివారం (జనవరి 18న) రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోన్న అమిత్ షా.. అదే రోజు రాత్రి ఉండవల్లిలోని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నివాసంలో భేటీ కానున్నారు. ఏపీలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు.. ఇటీవల జరిగిన తిరుపతి తొక్కిసలాట ఘటన, ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత లాంటి కీలక అంశాలు చర్చించనున్నారు. అనంతరం విజయవాడలోని హోటల్లో బస చేయనున్నట్టు బీజేపీ నేతలు తెలిపారు.

ఇక.. ఆదివారం (జనవరి 19న) గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం ప్రాంగణాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా ప్రసంగిస్తారు. కాగా.. శనివారం (జనవరి 18న) గుంటూరు, కడప జిల్లాల్లో పర్యటించనున్న సీఎం చంద్రబాబు నాయుడు.. అదే రోజు సాయంత్రం ఉండవల్లిలోని తన నివాసంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. అనంతరం.. చంద్రబాబు ఇంట్లో రాత్రి భోజనం చేయనున్నారు. ఆ తర్వాత రోజు.. (జనవరి 19న) సీఎం చంద్రబాబు.. దావోస్ పర్యటనకు బయల్దేరి వెళ్లనున్నారు.

మొత్తంగా ఈ నెల 18వ తేదీన ఏపీకి చేరుకోనున్న అమిత్ షా.. 19వ తేదీన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననుండడంతో.. రాష్ట్రంలో 2 రోజుల పాటు పర్యటన కొనసాగనుంది. ఈ మేరకు.. అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అమిత్ షాకు ఘన స్వాగతం పలికేందుకు.. ఎన్డీఏ నేతలు సన్నద్ధమవుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన వెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కూడా వస్తుండటంతో.. రాష్ట్రంలోని ఎన్డీఏ నేతల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. మరోవైపు.. తిరుపతిలో తొక్కిసలాట జరిగిన తర్వాత.. మొదటిసారి అమిత్ షా వస్తుండటంతో.. ఈ విషయంపై ఎలా స్పందించనున్నారన్నది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ఎపి ఎస్ ఆర్టీసీ కి భారీ లాభాలు..

## సంక్రాంతికి కాసుల పంట.. ఎన్ని కోట్లో తెలుసా..?

ఏపీఎస్ ఆర్టీసీకి సంక్రాంతి పండుగ బాగా కలిసొచ్చింది. భారీ లాభాలు తీసుకొచ్చిపెట్టింది. స్పెషల్ సర్వీసులు, రాయతీలు బాగానే వర్కవుటయ్యాయి. ఫలితంగా.. ఏపీఎస్ ఆర్టీసీకి కోట్లల్లో లాభాలు చేకూరాయి. సంక్రాంతి పండుగ అంటేనే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పెద్ద పండుగ. ఎవరు ఎక్కడ స్థిరపడినా.. పండుగ వేళ స్వగ్రామానికి చేరుకుని.. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. ఇందుకోసం నెలా, రెండు నెలల ముందు నుంచే ట్రైన్ టికెట్లు, బసు టికెట్లు బుక్ చేసుకుంటుంటారు. అయినా సరే చాలా మందికి టికెట్లు దొరకవంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందుకే.. ప్రయాణికులు సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపింది.

పండుగ సందర్భంగా.. జనవరి 8 నుంచి 13 వరకు 3400 సర్వీసులు నడిపించగా.. జనవరి 16 నుంచి 20వ తేదీ వరకు ఏకంగా 3800 సర్వీసులు నడిపించింది ఏపీఎస్ఆర్టీసీ. మరోవైపు.. పండుగ సెంటిమెంట్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ క్యాష్ చేసుకుని.. ప్రయాణికులను నిలువు దోపిడీ చేశాయి. ఈ క్రమంలో.. సంక్రాంతి పండుగకు నడిపే బస్సుల్లో ప్రయాణీకులపై ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయమని సంస్థ ఎండీ ప్రకటించారు. అలాగే.. రానూపోనూ టికెట్లు ఒకేసారి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి 10 శాతం డిస్కౌంట్ కూడా కల్పించింది. దీంతో.. ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌ని నమ్ముకోకుండా.. ఏపీఎస్ ఆర్టీసీనే నమ్ముకున్నారు.

ఫలితంగా.. ఈ సంక్రాంతికి అధిక సంఖ్యలో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేసి ఏపీఎస్ఆర్టీసీ సరికొత్త రికార్డు సాధించింది. దీంతో సంస్థకు కాసుల పంట పండింది. సంక్రాంతి పండుగ కోసమని 7200 బస్సులు రాను పోను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ఇప్పటి వరకూ ఏపీఎస్ఆర్టీసీలో సంక్రాంతికి 4 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణాలు సాగించారు. దీంతో.. ఇప్పటి వరకూ సంస్థకు రూ.12 కోట్ల ఆదాయం సమకూరటం గమనార్హం. సుమారుగా రూ.12.5 కోట్ల ఆదాయాన్ని ఏపీఎస్ఆర్టీసీ సంస్థ ఆశిస్తోంది.

అయితే.. చాలా మంది ప్రయాణికులు ఇప్పటికీ ఊళ్లల్లోనే ఉండిపోయారు. ఇంకెంత మంది జనాలు తమ సొంతూర్లోనే ఉండిపోయారు. చాలా మంది ప్రజలు.. వీకెండ్ తర్వాతే తిరుగు ప్రయాణాలు పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో.. మరింత ఆదాయం వస్తుందని ఏపీఎస్ఆర్టీసీ భావిస్తోంది. గతేడాది.. రాను పోను కలిపి రూ.12 కోట్లు ఆదాయం ఆర్జించిగా.. గతేడాది 4.3 లక్షల మంది ప్రయాణికులు ఏపీఎస్ఆర్టీసీలో ప్రయాణం చేశారు. ఈసారి.. ఆ రికార్డు బ్రేక్ చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఉవ్విళ్లూరుతోంది.



# రుయా ఆస్పత్రిలో కిలేడీ..

## డాక్టర్ వేషంలో పాడుపని, అడ్డంగా దొరికిపోయింది



తిరుపతి రుయా ఆస్పత్రిలో దొంగ డాక్టర్ వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డాక్టర్ వేషంలో ఆస్పత్రిలో తిరుగుతూ.. అందినకాడికి ఆ యువతి దోచుకునేది. ఆస్పత్రికి వచ్చే రోగులే ఆమెకు టార్గెట్. రోగులు, వారి సహాయకుల దగ్గర ఏం దొరికితే అది దొంగతనం చేసేది. ఇక తాజాగా ఓ మహిళ గాయపడి రుయా ఆస్పత్రికి చేరుకుంది. అయితే ఆ మహిళతో పరిచయం పెంచుకున్న ఈ దొంగ డాక్టర్.. ఆమెను స్కానింగ్ సెంటర్‌లోకి తీసుకెళ్లి.. నగలు తీయాలని చెప్పింది. అందులో భారీగా ఉన్న బంగారు గొలుసును గుట్టుచప్పుడు కాకుండా చోరీ చేసింది. చివరికి ఆ మహిళ భర్తకు అనుమానం వచ్చి నిలదీయగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ దొంగ డాక్టర్‌ను పట్టుకుని.. పోలీసులకు అప్పగించారు.

రుయా ఆస్పత్రిలో అనస్తీషియా టెక్నీషియన్ అని చెప్పుకుంటూ తిరుగుతూ వైఎస్సార్ జిల్లా వల్లూరుకు చెందిన శ్రీవాణి అనే యువతి.. చోరీలు చేస్తుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. డాక్టర్ లాగా తెల్ల కోటు వేసుకుని వచ్చి.. రోగులను బురిడీ కొట్టిస్తున్నట్లు రుయా ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. రోజూ లాగే మంగళవారం కూడా ఆస్పత్రిలో తన చోరీలకు దిగిన శ్రీవాణికి.. అప్పుడే రేణిగుంట నుంచి గాయాలతో వైద్యం కోసం వచ్చిన వెస్లీ అనే మహిళ కలిసింది. మొదట వెస్లీని పరిచయం చేసుకున్న శ్రీవాణి.. ఆమె గాయాలను పరిశీలించేందుకు స్కానింగ్ తీయాలని చెప్పింది. అందుకోసం స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి ఒంటిపై నగలు తీసేయాలని సూచించింది.

ఈ క్రమంలోనే తన ఒంటిపై ఉన్న 2 బంగారు గొలుసులు, 2 బంగారు గాజులను తీసిన వెస్లీ.. శ్రీవాణికి ఇచ్చి బయట తన భర్త ఉన్నాడని.. అతడికి ఇవ్వాలని సూచించింది. అయితే ఇక్కడే చేతివాటం ప్రదర్శించిన శ్రీవాణి.. వెస్లీ ఇచ్చిన బంగారు ఆభరణాలల్లో నుంచి 5 సవర్ల బంగారు గొలుసును తీసుకుని.. తన బ్యాగులో వేసుకుంది. మిగిలిన ఆభరణాలను స్కానింగ్ సెంటర్ బయట వేచి ఉన్న వెస్లీ భర్తకు అప్పగించింది.

అయితే ఆ బంగారు ఆభరణాలు చూసిన వెస్లీ భర్తకు అనుమానం వచ్చింది. మరో బంగారు గొలుసు ఉండాలని అతడు శ్రీవాణిని నిలదీశాడు. కానీ తనకేమీ తెలియదని.. ఆమె అక్కడి నుంచి మెల్లగా జారుకుంది. ఇక స్కానింగ్ సెంటర్ నుంచి బయటికి వచ్చిన వెస్లీ.. తన నగల్లో ఒక బంగారు గొలుసు కనిపించడం లేదని గుర్తించింది. వెంటనే రుయా ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రిలో గాలింపు చేపట్టారు. అక్కడే ఉన్న శ్రీవాణిని గుర్తించి ఆమె బ్యాగులో చెక్ చేయగా.. వెస్లీ బంగారు చైన్‌ను గుర్తించారు. దీంతో పోలీసులకు శ్రీవాణిని అప్పగించారు.




# ఈ సంక్రాంతికి రూ.2000 కోట్ల కోళ్ల పందేలు..

## కనుమ రోజే రూ.వెయ్యికోట్లు



తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు సంక్రాంతి పండగ అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఓ వైపు పిండి వంటలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, పూజలు, భోగి మంటలు జరుపుకోగా.. మరోవైపు కోడి పందేలు, గుండాటలు సహా అనేక పోటీలతో సంక్రాంతి పండగ వేళ చలిని బాగా హీటెక్కించారు. ఇక కోడి పందేల కోసం ఏర్పాటు చేసిన ప్రాంతాలు.. మినీ స్టేడియాలనే తలపించాయంటే నమ్మశక్యం కాదు. ఎక్కడ చూసినా టెంట్లు, కుర్చీలు, ఎల్ఈడీ స్క్రీన్లు, గ్యాలరీలు, కామెంట్రీలు.. ఇలా ఎక్కడికక్కడ భారీగా సెట్టింగ్‌లు వేశారు. మరోవైపు.. పండగ 3 రోజుల సందర్భంగా వందల కొద్దీ బరులు నిర్వహించారు. ఈ మూడు రోజుల్లోనే ఏకంగా రూ.2 వేల కోట్ల పందేలు జరిగినట్లు సమాచారం. కోనసీమ నుంచి మొదలుపెడితే రాయలసీమ వరకు పందేలతో హోరెత్తించారు.

సంక్రాంతి తొలి రోజు అయిన భోగి పండగ నాడు.. రూ.350 కోట్ల పందేలు సాగగా.. ఆ తర్వాత సంక్రాంతి రోజు ఆ నంబర్ దాదాపు డబుల్ అయి.. ఏకంగా రూ. 600 కోట్లు చేతులు మారాయి. ఇక చివరిదైన కనుమ రోజు మాత్రం పందెం రాయుళ్లు తగ్గేదే లే అనుకుంటూ చేతి చమురు వదిలించుకున్నారు. ఒక్క కనుమ పండగ రోజే ఏకంగా వెయ్యి కోట్ల పందేలు జరిగినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క కోడి పందెమే రికార్డుస్థాయిలో రూ. 1.25 కోట్లు పలికినట్లు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం పైబోయిన వెంకటరామయ్యతోటలో జరిగింది ఈ పందెం ఈసారి సంక్రాంతి పండగకు ఏపీలోనే హైలైట్‌గా నిలిచింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, కోనసీమల్లో రూ.500 కోట్ల పందేలు జరిగినట్లు సమాచారం. ఇక కోడిపందేలతో సమానంగా గుండాట కూడా భారీగానే నిర్వహించారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 3 రోజుల్లో రూ.250 కోట్లకుపైగా పందేలు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లాలో రూ.150కోట్లు.. కోనసీమ జిల్లాలో రూ.100 కోట్లకుపైగా పందేలు, గుండాట జరిగినట్లు తెలుస్తోంది. దీంతో మొత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతా కలిపి 1500కిపైగా బరుల్లో రూ.500 కోట్ల పందేలు జరిగనట్లు చెప్పుకుంటున్నారు.

కాకినాడ జిల్లాలో గుండాట వ్యాపారులకు కాసుల పంట పండించింది. ఒక్కో గ్రామంలో 2 నుంచి 4 గుండాట బోర్డులు ఏర్పాటు చేసి రూ.లక్షల్లో లావాదేవీలు జరిగాయి. ప్రత్తిపాడు మండలంలోని ఓ గ్రామంలో సంక్రాంతి 3 రోజులకు కలిపి ఓ గుండాట నిర్వాహకుడు ఏకంగా రూ.1.20 కోట్ల బిజినెస్ సాగించినట్లు స్థానికులు గుసగుసలు పెట్టుకుంటున్నారు. అందులో ఆ వ్యాపారి రూ.25 లక్షలు సంపాదించినట్లు తెలుస్తోంది. మురమళ్ల, కరపలో గుండాట నిర్వాహకులు రూ.కోటికిపైగా జేబులో వేసుకున్నారు. కాకినాడ జిల్లాలో 490 బరులు ఏర్పాటు కాగా.. రూ.250 కోట్లకు పైగా పందేలు జరిగాయి.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడిపందేలు, పేకాట, గుండాట జోరుగా సాగాయి. తెలంగాణ సరిహద్దు అయిన జగ్గయ్యపేట నుంచి మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్ వరకు బరులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాగిన కోడి పందాల్లో రూ.400 కోట్లు చేతులు మారినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్కో పందెం రూ.లక్ష నుంచి రూ.7 లక్షల వరకు సాగినట్లు తెలుస్తోంది. ఇక వీఐపీ బరుల్లో అయితే రూ.3 నుంచి రూ.5 లక్షలపైనే పందాలు కాసినట్లు చెబుతున్నారు.

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లిలో కోడిపందేల శిబిరం వద్ద ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపుతోంది. గుండాటలో రూ.200 గెలుచుకున్నప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో కొమ్మిశెట్టి గంగాధర్ అనే 18 ఏళ్ల యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత భయంతో పక్కనే ఉన్న నీళ్ల కుండీలోకి దూకగా.. అప్పటికే తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తణుకు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇక పలువురు పందేల్లో థార్ జీపు, బుల్లెట్ బైకులు, స్కూటీలు గెలుచుకున్నారు.

# ప్రకాశం జిల్లాలో విషాదం..

## సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

అమరావతి : ఏపీలోని ప్రకాశం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. సముద్ర స్నానానికి వెళ్లిన ఐదుగురిలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. సింగరాయకొండ పాకల బీచ్‌లో గురువారం ఐదుగురు సముద్రస్నానానికి వెళ్లారు. సముద్రంలో అలల తాకిడికి ఐదుగురూ గల్లంతయ్యారు. గల్లంతైన ఇద్దరిలో ఒకరిని జాలర్లు కాపాడగా మరో ముగ్గురు మృతి చెందారు. మరొకరి కోసం మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మృతులు పొన్నలూరు మండలం తిమ్మపాలెంకు చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాలను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.



# శ్రీశైలంలో ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు..అలరించిన వేదసభ

శ్రీశైలం : జ్యోతిర్లింగం, శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడు రోజుల పంచాహ్నిక దీక్షతో నిత్యం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం ఉదయం చండీశ్వరస్వామికి షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రుద్రహోమ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచన పూజాధికాలు జరిపించారు. ఆలయ పుష్కరిణిలో వైదిక శాస్త్రోక్త అవబృదస్నానం చేయించిన తర్వాత వసంతోత్సవాన్ని నిర్వహించారు. సంక్రాంతి రోజు స్వామిఅమ్మవార్లకు కల్యాణం జరిపిన అనంతరం.. సాంప్రదాయం ప్రకారం భ్రమరాంబదేవి అమ్మవారికి మెట్టెలు నల్లపూసలు సమర్పించే నాగవల్లి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యకల్యాణ మండపంలో సదస్యం వేదస్వస్థి తర్వాత ఉత్సవాల్లో దేవతవలకు ఆహ్వానం పలుకుతూ ఆవిష్కరించిన ధ్వజపటాన్ని అవరోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాస రావు వేదశ్రవణంతో ఆధ్యాత్మిక శోభ భారతీయ జీవనశైలికి ఆధారమైనవి చతుర్వేదాలేనన్నారు. సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 32మంది వేదపండితులచే సామవేదం, రుగ్వేదం, అధర్వణవేదం, యజుర్వేద పఠనాన్ని చేయించారు. ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రెండు గంటల పాటు వేదాలను పఠింపజేసిన తరువాత సదస్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాన్యులకు కూడా వేదసారాలు అర్థమయ్యే ఆవశ్యకత ఉన్నందున ప్రత్యేకంగా వేదసభ నిర్వహించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. వేద పఠనానికి వచ్చిన పండితులకు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రంతోపాటు నూతనవస్త్రాలు ఇచ్చి ఘనస్వస్తి నిర్వహించినట్లు స్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు వివరించారు.



# తెలంగాణకే దిక్కులేదు..

## ఢిల్లీ కాంగ్రెస్ హామీలకు రేవంత్ గ్యారంటీనా!?



(మమతా రెడ్డి - జర్నలిస్ట్)

**మొదటి పేజీ తరువాయి**

రైతుభరోసాగా ప్రకటించిన రెండో గ్యారంటీ కింద ఏటా ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, వరి పంటకు రూ.500 బోనస్, వ్యవసాయ కూలీలకు యేటా రూ.12 వేల సాయం అనే హామీలిచ్చారు. కేసీఆర్ హయాంలో ఒక్కో సీజన్ కు ఒక్కో ఎకరానికి రూ.5 వేల చొప్పున ఇచ్చే రైతుబంధు సాయాన్ని ఎగవేశారు. రైతుభరోసాను రూ.15 వేల నుంచి రూ.12 వేలకు కుదించి జనవరి 26 నుంచి అమలు చేస్తామని చెప్తున్నారు. అది పంట సాగు చేసిన రైతులకేనని షరతు పెట్టారు. కౌలు రైతుల ముచ్చటే లేదు. బోనస్ ను సన్నవడ్లకే పరిమితం చేశారు. మూడో గ్యారంటీ ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత కరెంట్ పాక్షికంగా అమలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నాలుగో గ్యారంటీ ఇంకా ఈ పథకం పట్టాలెక్కలేదు. యువ వికాసం అనే గ్యారంటీని విజయవంతంగా తుంగలో తొక్కేశారు. వృద్ధులు, వితంతువులకు ఇస్తున్న ఆసరా పింఛన్ పేరును చేయూతగా మార్చి నెలకు రూ.4 వేలకు పెంచి ఇస్తామని ఆరో గ్యారంటీని అటకెక్కించారు. గ్యారంటీల్లో ప్రకటించకుండా రాహుల్ గాంధీతో ఇప్పించిన ఇంకో గ్యారంటీ కాంగ్రెస్ ను గెలిపిస్తే మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన. ఈ హామీ కలగానే మిగిలిపోయింది. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు పెట్టి తుది దశలో ఉన్న ఉద్యోగాల భర్తీ తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా ఒక్క భారీ ఉద్యోగ నియామక ప్రకటనే విడుదల చేయలేదు.

### రేవంత్ కు లేని అపాయింట్‌మెంట్.. కేబినెట్ లో ఉన్న ఇద్దరు ముఖ్య నాయకులకు అపాయింట్మెంట్

ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి వస్తే.. ఆయనకు కొన్నాళ్లుగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలెవరూ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. హైడ్రా పేరుతో సాగించిన విధ్వంసకాండనే ఇందుకు కారణమని ఢిల్లీ సర్కిల్స్‌లో చర్చ సాగుతోంది. రేవంత్ పాలనపై రాహుల్ గాంధీ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని.. అందుకే తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు గడిచినా కనీసం కేబినెట్ విస్తరణకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేతలే చెప్తున్నారు. 13 నెలల తర్వాత తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ ఇటీవల సమావేశమైంది. ఈ సమావేశానికి రాహుల్ దూతగా కేసీ వేణుగోపాల్ ఢిల్లీ నుంచి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై ఆయన తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డికి మాత్రమే రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. రేవంత్ రెడ్డి కేబినెట్ లో ఉన్న ఇద్దరు ముఖ్య నాయకులకు ఎప్పుడంటే అప్పుడు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు.. అంటే ఆయన ఏం సంకేతాలు ఇస్తున్నట్టు? రేవంత్ వ్యవహారశైలి పార్టీకి చేటు చేస్తుందని రాహుల్ చెప్తున్నట్టే కదా?!

### పార్టీకి ఆర్థికంగా ఉన్న రాష్ట్రం కాబట్టి డిస్టర్బ్ చేయడం లేదు

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ ను నియమించాలని మొదట ప్రతిపాదించింది రేవంత్ రెడ్డినే. కానీ అప్పుడు ఆ నియామకం జరగలేదు. కాంగ్రెస్ పార్టీకి మహేశ్ కుమార్ గౌడ్ లాయల్. అలాంటి వ్యక్తి రేవంత్ హోల్డ్ లో ఉండటం మంచిది కాదని పార్టీ హైకమాండ్ భావించింది. అందుకే నేరుగా పార్టీ ముఖ్య నేతలు మహేశ్ తో చర్చలు జరిపి.. పార్టీ లైన్ లో మాత్రమే పని చేయాలని దిశానిర్దేశం చేసిన తర్వాతే ఆయనను పీసీసీ అధ్యక్షుడిగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో ఏ సీనియర్ నేతను కదిలించినా ఈ విషయం చెప్తారు. తాను సీఎంగా ఉన్న సొంత రాష్ట్రంలోనే రేవంత్ రెడ్డికి పూర్తిగా పాలనపై, పార్టీపై పట్టు లేదని కాంగ్రెస్ హైకమాండ్ అంచనాకు వచ్చింది. పార్టీకి ఆర్థికంగా అండగా నిలుస్తున్న కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలను ఇప్పటికిప్పుడు డిస్టర్బ్ చేసే ఆలోచనలో కాంగ్రెస్ హైకమాండ్ లేదనే చెప్తున్నారు. కానీ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఆ రోజు వస్తే జరగాల్సిన లాంఛనాలు జరిగిపోతాయని కాంగ్రెస్ ముఖ్యులు బలంగానే చెప్తున్నారు. తన రాష్ట్రంలో తనకే గ్యారంటీ ఉంటుందో లేదో తెలియని తెలంగాణ ముఖ్యమంత్రి ఢిల్లీ ప్రజలకు గ్యారంటీ ఇస్తానని గ్యారంటీ ఇవ్వడమే హాస్యాస్పదం. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ రేవంత్ రెడ్డి ఇలాంటి చిత్రవిచిత్ర విన్యాసాలే చేసి చివరికి ఒక్క సీటును గెలిపించలేకపోయారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అంతకన్నా గొప్ప ఫలితాలు వస్తాయని విశ్లేకులు అంచనా వేయడం లేదు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీకి మధ్య జరుగుతున్న పోరు మాత్రమేనని అంచనా వేస్తున్నారు. అందుకే ఇండియా కూటమిలో ఉన్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆమ్ ఆద్మీ పార్టీకి జై కొట్టారు. అన్ని సర్వేలు కూడా ఆప్ వర్సెస్ బీజేపీనే క్షేత్రంలో తలపడుతున్నాయని చెప్తున్నాయి. అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ప్రజలను ఎలాగైనా మెప్పించి గ్యారంటీ మంత్ర ఎత్తుకుంది. కానీ గ్యారంటీలకు కాలం చెల్లిపోయింది. కర్నాటక, తెలంగాణ ప్రజల అనుభవాలు ఇదే చెప్తున్నాయి. కర్నాటకలో ఐదు గ్యారంటీలతో గెలిచిన ఊపులో తెలంగాణలోనూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రకటించింది. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు విశ్వసించలేదు. రాహుల్ గాంధీ తన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకొని నరేంద్రమోదీకి తానే ప్రత్యామ్నాయం అని ప్రజలకు నమ్మకం కలిగించాలంటే మరింత బలంగా పని చేయాలి. కానీ హర్యానాలో పొత్తు ప్రతిపాదన తెచ్చినా ఆప్ ను పట్టించుకోకుండా స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఓవర్ కాన్ఫిడెన్స్ తో మహారాష్ట్రలో చావుదెబ్బ తిన్నారు. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ఇండియా కూటమి ఉనికికే ముప్పుతెచ్చారు. రేవంత్ నాయకత్వం పట్ల రాహుల్ గాంధీకి ఎలాంటి అభిప్రాయం ఉన్నా పూర్తి కేబినెట్ ను ఏర్పాటు చేసుకోలేని.. ప్రతి నిర్ణయానికి ఢిల్లీపై డిపెండ్ అవుతున్న బలహీన ముఖ్యమంత్రి రేవంత్ అన్న అపప్రద రాకుండా చూసుకోవాలి. ఇప్పటికిప్పుడు దీనిపై చర్చ లేదేమో.. రేపుమాపు కచ్చితంగా ఇదే చర్చనీయాంశం అయి తీరుతుంది. అదే జరిగితే రేవంత్ కు వచ్చేనష్టమేమి ఉండకపోవచ్చు.. ఆయన లైఫ్ గోల్ రీచ్ అయ్యాడు. నిండా మునిగేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే!

# కేటీఆర్ విచారణ..

## ఢిల్లీ చేరుకున్న హరీశ్ రావు

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఫార్ములా ఈ రేస్ కేసు హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ రేస్ సమయంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలతో ఈ కేసు బాగా సీరియస్ గా మారుతోంది. ఈ నేపథ్యంలో, ఈడీ దర్యాప్తు మరింత లోతుగా జరుగుతుండటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కేటీఆర్ మాత్రం తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ఇవి పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యలేనని చెబుతున్నారు. అయితే, ఈ కేసు హైకోర్టులో కొట్టివేయాలని దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించడంతో పాటు, సుప్రీంకోర్టు కూడా ఈ కేసులో కలగజేసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో ఈడీ విచారణ మరింత స్ట్రాంగ్ గా ముందుకు సాగుతోంది.

ఇది మాత్రమే కాకుండా, ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే బీఆర్ఎస్ కీలక నేత, మంత్రి హరీశ్ రావు ఢిల్లీకి వెళ్లడం కొత్త చర్చలకు దారితీసింది. హరీశ్ రావు పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ, ఆయన ఢిల్లీకి వెళ్లడాన్ని రాజకీయ పరోక్ష అర్థాలతో పరిశీలిస్తున్నారు. కేటీఆర్ విచారణ జరుగుతున్న సమయంలో హరీశ్ రావు ఢిల్లీలో ఉండటం అనేకమంది రాజకీయ విశ్లేషకులను ఆలోచనలో పడేసింది.

ఈ కేసు మీద ఈడీ దర్యాప్తు మరింత వేగవంతం కావచ్చని సమాచారం అందుతోంది. కేటీఆర్‌ను మరింత సుదీర్ఘంగా విచారించే అవకాశం ఉందని అంటున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం కేటీఆర్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, ఈ కేసును నిరాధారమైనదిగా అభివర్ణిస్తున్నాయి. అవినీతి ఆరోపణలను పక్కనబెడుతూ, కేటీఆర్ ప్రజాసేవకే ప్రాధాన్యత ఇస్తున్నారని అంటున్నారు.

ఈ పరిణామాల మధ్య, హరీశ్ రావు ఢిల్లీ పర్యటనపై అనేక ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన ఢిల్లీ పర్యటన కేవలం అధికారిక పనులకు సంబంధించినదా లేదా అనే విషయం స్పష్టతకు రావాల్సి ఉంది. ఇక ఈ కేసు మలుపు ఎలా తిరుగుతుందన్న దానిపై అందరి చూపు నిలిచింది. కేటీఆర్ విచారణ పూర్తయ్యాక ఈడీ మరిన్ని కీలక పరిణామాలను బయటపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు, బీఆర్ఎస్ మాత్రం సుప్రీం కోర్టులో పార్టీ మారిన బీఆర్ ఎస్ ఎంఎల్ఏ అనర్హత పిటిషన్ పై న్యాయ నిపుణులతో మాట్లాడేందుకే హరీష్ రావు ఢిల్లీ వెళ్లారని చెప్పుతుంది.



# రోడ్డు భద్రత మాసోత్సవాలు



**మహబూబాబాద్, 16 జనవరి (క్రాంతి న్యూస్ ):** రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని తొర్రూర్ ఎక్స్ రోడ్ వద్ద రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు గులాబీ పూలు పంచడం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం గులాబీ పూలు పంచడం రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు...ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డి టి ఓ జైపాల్ రెడ్డి సి ఐ సర్వయ్య మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ ఎం.సాయి చరణ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు ..

# విప్లవ కార్మిక సంఘాల విలీన సభను జయప్రదం చేయండి



**వరంగల్, 16 జనవరి (క్రాంతి న్యూస్ ):** వరంగల్ జిల్లా కాశిబుగ్గ జంక్షన్ లో కార్మిక సంఘాల నాయకులతో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కేంద్రంలో 18వతేదీన జరుగు విప్లవకార్మిక సంఘాలైన రెండు ఐఎఫ్టియుల విలీనసభ సభను జయప్రదం చేయాలనికాశీబుగ్గ జంక్షన్ లో కార్మికసంఘ నాయకులు,కార్యకర్తలు కలసి పోస్టర్ ఆవిష్కరించారు. ఐఎఫ్ టి యు నాయకులు బండి కుమార్ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షులు గంగుల దయాకర్, మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిర్మాణ పరంగా వేర్వేరుగా కొనసాగుతున్న రెండువిప్లవ కార్మికసంఘాలు విలీనం కావలసినటువంటి ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు రోజు,రోజుకు పెరుగుతున్న కాంట్రాక్టీకరణ ఔట్సోర్ ఔట్సోర్సింగ్ విధానాలవల్ల కార్మికవర్గం నష్టపోతున్నదని భారతపాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ విధానాలవల్ల కార్మికవర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని ఆయనఅన్నారు. సంస్కరణ వాద కార్మికసంఘాలకు ప్రత్యామ్నాయంగా సంఘటిత సమరశీల కార్మికఉద్యమాన్ని నిర్మించవలసిన బాధ్యత విప్లవకార్మిక సంఘాలకే ఉన్నదని అన్నారు.ఈసందర్భంగా ఈ విలీనసభ జరుగుతుందని ఆయన తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా ఐ ఎఫ్ టి యు జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ హాజరై ప్రసంగిస్తారని అలాగే వివిధఅంశాలపై ఐఎఫ్టియు జాతీయ ఉపాధ్యక్షులు బూర్గుల ప్రదీప్ జాతీయఅధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు జాతీయ ఉపాధ్యక్షులు పి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, జనార్ధన్, సీతారామయ్య, కొక్కు సారంగపాణి తదితరులు మాట్లాడతారని ఆయన తెలిపారు.ఈసభను జయప్రదం చేయాలని జిల్లా కార్మికవర్గాన్ని ఆయన ఈ సందర్భంగా కోరారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లానాయకులు బండి కోటేశ్వరరావు రాచర్ల బాలరాజు పి వై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ ఐ ఎఫ్ టి యు నగర ప్రధానకార్యదర్శి బన్న నర్సింగ్గం,గద్దల ప్రభాకర్ సాంబయ్య కిరణ్ రమేష్ రాజేష్ ఎండి ఖాన్ హరిబాబు ఎండి అక్బర్ సుద్దాల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హలో మాదిగ చలో హైదరాబాద్ మందకృష్ణ మాదిగ పిలుపు

**-లక్ష డప్పులు, వేయి గొంతుల పాటల సిడిని ఆవిష్కరించిన మందకృష్ణ మాదిగ**




**ఖమ్మం, 16 జనవరి (క్రాంతి న్యూస్ ):** వచ్చే నెల ఫిబ్రవరి 7న హైదరాబాద్ లో తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రూపొందించిన పాటల సిడి ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, ఎస్సీ వర్గీకరణ ఆశాజ్యోతి మన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆవిష్కరణ చేశారు. ఖమ్మం లోని మామిళ్లగూడెం ఆర్ అండ్ బి అతిథి గృహం సమీపంలో ఉన్న ఎన్ 7 స్టూడియోస్ లో ఈ పాటల సిడి ని ప్రజా యుద్ధ నౌక ఏపూరి సోమన్న తో కలిసి మంద కృష్ణ మాదిగ అట్ట హసంగా గురువారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ హైదరాబాదులో జరిగే లక్ష డప్పులు వేల గొంతు కుల కార్యక్రమం కానీ విని ఎరుగని రీతిలో జరగబోతుందని, ఎస్సీ వర్గీకరణ ను రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున రాష్ట్ర నలుమూలల నుంచి కళాకారులు, మేధావులు సబండవర్గాలు తరలి రాబోతున్నాయని తెలిపారు. ఎస్సీల న్యాయ బద్ధమైన డిమాండ్ ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఫిబ్రవరి 7 న లక్షలదిగా హైదరాబాద్ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మంలోని ఎన్ 7 స్టూడియోస్ రికార్డింగ్ థియేటర్ చైర్మన్ నందిగామ రాజ్ కుమార్ జానీ ఆధ్వర్యంలో 20 పాటలతో సిడి ని రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా యుద్ధ నౌక ఏపూరి సోమన్న, గిద్దే గళం గిద్దె రామ నర్సయ్య, ఎన్7 స్టూడియోస్ రికార్డింగ్ థియేటర్ చైర్మన్ నందిగామ రాజ్ కుమార్ జానీ, మ్యూజిక్ డైరెక్టర్ బొమ్మెర అరవింద్, వినయ్, బలరాం, దగ్గుపాటి రమా దేవి, సినిమాటిక్ శ్యామ్, సినిమా డైరెక్టర్ సాయి, సింగర్ అక్బర్, రచయిత కొమ్ము రవి, టెక్నీకల్ టీమ్ వాసు, కిరణ్,ప్రసాద్, శ్రావణ్, సందీప్, ముష్టికుంట్ల ప్రవీణ్, జాక్సన్ పలువురు జర్నలిస్టులు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు




**హుస్నాబాద్, 16 జనవరి (క్రాంతి న్యూస్ ):** హుస్నాబాద్ పురపాల సంఘం అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో ఆకుల రజిత వెంకన్న చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈనెల ఇరువై నాలుగునుండి ఇరువై నాలుగో వ తారీఖు వరకు జరిగే వార్డు సభల లో కౌన్సిలర్లు వార్డ్ ఆఫీసర్లు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రజలు అందరూ కలిసి ప్రజల సమక్షంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు కొత్త రేషన్ కార్డులు మంజూరు వార్డు సభ ద్వారా ఎన్నిక జరుగుతుంది కావున వార్డు సభలో ప్రజలందరూ పాల్గొనాలని తెలిపారు దీనిలో నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు గాని రేషన్ కార్డులను గాని కొత్తవి ఇవ్వాలని కోరడం జరిగింది పట్టణంలో చాలామందికి రేషన్ కార్డులు అప్లికేషన్ పెట్టుకున్న ఈ లిస్టులో రాలేని వారు మున్సిపల్ కార్యాలయంలో తమ అప్లికేషన్ పెట్టుకోవాలని చైర్ పర్సన్ కోరారు నిరుపేదలైన ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు అర్హత ఉన్నవారికి అందరికీ ఇవ్వాలని చైర్ పర్సన్ కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, కొంకటి నళినీ దేవి, బోజు రమా దేవి, కోమటి స్వర్ణ లత, పెరిక భాగ్యరెడ్డి, చిత్తారి పద్మ, మ్యదరబోయిన వేణుకి, గోవింద రవి, దొడ్డి శ్రీనివాస్, భూక్య సర్వజన, జనగామ రత్నమాల, వల్లపు రాజు, బొజ్జ హరీష్, వాళ సుప్రజ కౌన్సిలర్లు, ఐలేని శంకర్ రెడ్డి,యండి ఆయూబ్ కోఆప్షన్ సభ్యులు, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్య క్రాంతి



## బాడీలోని టాక్సిన్స్‌ని దూరం చేసి ఆరోగ్య సమస్యలు దూరమయ్యేందుకు వీటిని తినండి

హెల్త్ న్యూస్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): మన ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా హెల్దీ ఫుడ్ తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారం పోషకాహారమై ఉండాలి. ఈ ఫుడ్ వల్ల మన బాడీకి పోషణ, బలం అందుతుంది. శక్తి కూడా పెరుగుతుంది. ప్రజెంట్ ఎక్కడ చూసినా పొల్యూషన్, కెమికల్స్‌తో కూడిన ఫుడ్స్ మాత్రమే ఉంటున్నాయి. వీటి ఎఫెక్ట్ ఫుడ్‌కి కూడా ఉంటుంది. ఆ ఫుడ్స్‌ని తిన్నప్పుడు మన బాడీలో టాక్సిన్స్ పెరుగుతాయి. దీంతో ఆరోగ్య సమస్యలొస్తాయి.

టాక్సిన్స్‌లో రెండు రకాల టాక్సిన్స్ ఉంటాయి. ఒకటి ఆహారం జీర్ణమైన తర్వాత ఏర్పడే సహజమైనవి అయితే, మరికొన్ని రసాయనాలు, ఎరువుల ద్వారా పండే పంటలతో వచ్చే కృత్రిమమైన టాక్సిన్స్. ఈ టాక్సిన్స కారణంగా మన బాడీలో చాలా సమస్యలో వస్తాయి. అందుకోసం డైట్‌లో కొన్ని కూరగాయల్ని యాడ్ చేసుకోవాలి. దీంతో బాడీలోని టాక్సిన్స్‌ని బయటికి వెళ్ళిపోతాయి.




నట్స్ :నట్స్, గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల బాడీలో పేరుకుపోయిన టాక్సిన్స్ అన్నీ బయటికి వచ్చేస్తాయి. వీటితో పాటు యాంటీ ఆక్సిడెంట్ రిచ్ ఫుడ్స్ తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల మన అవయవాలు కూడా చక్కగా ఉంటాయి. ఇందులో బెర్రీస్, బెల్ పెప్పర్స్, సిట్రస్ ఫ్రూట్స్, బ్రకోలీ, చిక్కుళ్ళు, గ్రీన్‌టీలు ఉన్నాయి.

పండ్లు :పండ్లలో కూడా సిట్రస్ ఫ్రూట్స్, బెర్రీస్, పుచ్చకాయలు తినడం మంచిది. వీటిలో నీటిశాతం ఎంత ఎక్కువగా ఉంటుంది. విటమిన్స్ కూడా అంతే విధంగా అందుతాయి. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల బాడీలోని టాక్సిన్స్ దూరమై ఆరోగ్యానికి చాలా మంచిది.

కూరగాయలు :తాజా కూరగాయలు, ముఖ్యంగా బ్రకోలీ, కాలీఫ్లవర్, క్యాబేజీ, బ్రసెల్స్ స్ప్రౌట్స్‌లో సల్ఫర్ కలిగిన సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల బాడీలోని టాక్సిన్స్ దూరమవుతాయి. దీంతో పాటు జీర్ణ సమస్యలు, ఇతర సమస్యలు కూడా దూరమవుతాయి.

పసుపు :పసుపులోని గుణాలు తెలుసు కాబట్టే తరతరాలుగా మన పూర్వీకులు పసుపుని ఎక్కువగా వాడతారు. దీనిని వంటల్లోనే కాదు ఆయుర్వేద మందుల తయారీల్లోనూ వాడతారు. పసుపుని వాడడం వల్ల ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఇమ్యూనిటీని పెంచి అనారోగ్యాలను దూరం చేస్తాయి. ఇది చర్మ ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

ప్రోబయోటిక్స్ :పులియబెట్టిన ఫుడ్స్‌లో హెల్దీ బ్యాక్టీరియా ఉంటుంది. వీటిని మీరు మీ డైట్‌లో యాడ్ చేయడం వల్ల ప్రేగుల్లోని హానికరమైన బ్యాక్టీరియా కూడా దూరమవుతుంది. వీటితో పాటు ఫైబర్ ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తీసుకోవాలి. అదే విధంగా, నీరు ఎక్కువగా తాగాలి.

ఉల్లిపాయలు, వెల్లుల్లి :ఉల్లి, వెల్లుల్లి మనం కూరగాయల్లో ఎక్కువగా వాడతం ఇందులోని సల్ఫర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల డీటాక్స్ జరుగుతుంది. వీటిని మనం పచ్చిగా అయినా తినొచ్చు. కూరల్లో వేసి అయినా తినొచ్చు. అదే విధంగా, నెయ్యి, వెన్న, తేనె, ఎండు అల్లం, నల్ల మిరియాలు, రాళ్ళ ఉప్పుని కూడా మన డైట్‌లో యాడ్ చేస్తే బాడీలో పేరుకుపోయిన టాక్సిన్స్‌ని దూరం చేసుకోవచ్చు.

## ఎవరికైనా ఇలాంటి లక్షణాలు ఉంటే బాడీలో విటమిన్ సి లోపం ఉన్నట్లే




హెల్త్ న్యూస్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): విటమిన్ సి మన బాడీలో కీ రోల్ పోషిస్తుంది. ఇది మనకి ఈజీగా దొరుకుతుంది. విటమిన్ సి లోపం అనేది చాలా మంది ఫేస్ చేసే ప్రాబ్లమ్. కాబట్టి, రోజూ కచ్చితంగా విటమిన్ సిని మన డైట్‌లో యాడ్ చేసుకోవాలి. లేదంటే, విటమిన్ సి లోపం వస్తుంది. ఈ లోపాన్ని మనం కొన్ని లక్షణాల ద్వారా గుర్తించొచ్చు. అవేంటో తెలుసుకోండి.

మాటిమాటికీ ఆరోగ్య సమస్యలు

విటమిన్ సి లోపం ఉంటుంటే ఊరికే జబ్బులు వస్తుంటాయి. విటమిన్ సి యాంటీ ఆక్సిడెంట్. ఇది ఆక్సీడేటివ్ స్ట్రెస్, ఇన్ఫెక్షన్స్ నుంచి మనల్ని కాపాడతాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్స్ త్వరగా గాయాల్ని తగ్గిస్తాయి. కొల్లాజెన్ పెరిగేలా చేస్తుంది. విటమిన్ సి కారణంగా ఇన్ఫెక్షన్స్ పెరగకుండా ఉంటాయి. మీరు పండ్లు, కూరగాయలు తినడం వల్ల అందులో ఎక్కువగా విటమిన్ సి ఉంటుంది. దీంతో మీ బాడీకి కావాల్సిన విటమిన్ సి అందుతుంది.

కీళ్లు, కండరాల నొప్పులు

కీళ్లు, కండరాల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. దీంతో పాటు రక్తహీనత సమస్య వస్తుంది. ఐరన్ అబ్జార్బ్ తక్కువగా ఉంటుంది. కాబట్టి, ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గుతుంది. దీంతో ఎప్పుడు చిరాగ్గా విచారంగా ఉంటారు. కొంతమంది బరువు కూడా తగ్గుతారు. ఏ పనులు చేయకుండానే ఎక్కువగా నొప్పులు వస్తుంటే దీనిని అనుమానించాల్సిందే.

నీరసం

ఊరికే అలసిపోవడం, నీరసంగా ఉన్నారంటే మీకు విటమిన్ సి కావాల్సిందే. మనం తీసుకునే డైట్‌లో సరైన విధంగా విటమిన్ సి లేకపోతే మనం ఏ పనిచేసినా ఊరికే అలసిపోతాం, త్వరగా నీరసంగా మారతాం. అందుకే, ఇలాంటి సమస్య ఉంటే వెంటనే డాక్టర్‌ని కలవండి. మిమ్మల్ని పరీక్షించి ఏం సమస్య ఉందో చెబుతారు.

గాయాలు తగ్గకపోవడం

మీకు ఏదైనా సర్జరీ, గాయాలు, పుండ్ల లాంటివి అయినప్పుడు ఆ తాలుకూ గాయాలు త్వరగా తగ్గవు. ఈ సమస్య రాకుండా ఉండాలంటే విటమిన్ సి ఎక్కువగా తీసుకోవాలి. అధ్యయనాల ప్రకారం, సర్జరీ అయిన వారు ఎవరైతే విటమిన్ సి సప్లిమెంట్స్ తీసుకున్నారో, ఆ ట్యాబ్లెట్స్ తీసుకోని వారి కంటే త్వరగా గాయాలు తగ్గినట్లు తేలింది. విటమిన్ సి హెల్దీ కొల్లాజెన్‌ని సపోర్ట్ చేస్తుంది. ఈ హెల్దీ ప్రోటీన్ స్కిన్‌ని స్మూత్ అండ్ సాఫ్ట్‌గా ఉండేలా చేస్తుంది. సరిపడా విటమిన్ సి మన బాడీలో లేకపోతే మనం వయసు కంటే పెద్దవారిలా కనిపిస్తాం. మీకు యవ్వనమైన మెరిసే చర్మం కావాలంటే కచ్చితంగా విటమిన్ సి ఎక్కువగా ఉండే ఫుడ్స్, పండ్లు తీసుకోవాలి. అందులో కివీస్, ఆరెంజెస్ వంటివి ఉంటాయి.

స్కిన్ ప్రాబ్లమ్స్

మీకు సరిపడా విటమిన్ సి అందకపోతే స్కిన్ ప్రాబ్లమ్స్ వస్తాయి. విటమిన్ సి లెవల్స్ తగ్గితే చర్మం ఎర్రబడడం, రాషెస్ రావడం వంటివి జరుగుతాయి. అంతేకాకుండా నోటి చుట్టూ, పెదవల చివర్ల స్కిన్ డ్రైగా మారి పగులుతుండడం జరుగుతుంది. మీకు నార్మల్ కంటే త్వరగా గాయలవుతుంటే విటమిన్ సి లోపం కావొచ్చు. ఈ విటమిన్ బాడీలో రక్త సరఫరాని సరిగా జరిగేలా చూస్తుంది. ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తుంది. కానీ, ఈ విటమిన్ సరిపడా లేకపోతే త్వరగా సమస్యలొస్తాయి. కాబట్టి, ఈ విషయంలో కూడా జాగ్రత్త అవసరం. చర్మంపై గాయలవ్వడం, ముఖ్యంగా కాళ్ళు, చేతులపై గాయలవుతుంటాయి.


జుట్టు రాలడం

జుట్టు త్వరగా రాలుతుంటుంది. పొడిబారి, పెళుసుగా మారుతుంది. నిర్జీవంగా మారుతుంది. దీంతో జుట్టు బలహీనమవుతుంది. త్వరగా రాలుతుంది. రెగ్యులర్‌గా ఎక్కువగా జుట్టు రాలుతుంటే విటమిన్ సి లోపం ఉందో ఓ సారి చెక్ చేయండి. చిగుళ్ల సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. వాపు, రక్తస్రావం వంటి సమస్యలొస్తాయి. ఊరికే దంత సమస్యలొస్తాయి. దంతాలు వదులుగా మారడం, ఊడిపోవడం వంటివి జరుగుతాయి. కాబట్టి, జాగ్రత్తగా ఉండాలి.

## ప్రోటీన్లు మోతాదు మించొద్దు!

హెల్త్ న్యూస్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): ఆరోగ్యకరమైన జీవితానికి ఆహారంలో తగినన్ని ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలనే విషయం తెలిసిందే. దీంతో చాలామంది ప్రోటీన్లు మంచివని ఆహారంతోపాటు ఎలాంటి సూచన లేకుండానే సప్లిమెంట్లు, ప్రోటీన్ పదార్థాలను ప్రత్యేకంగా తీసుకుంటున్నారు. అయితే, ప్రోటీన్లు తక్కువైతే ఆరోగ్యానికి ఎంత ముప్పు ఉంటుందో ఎక్కువైనా అంతే సమస్య! కాబట్టి, రోజువారీ ఆహారంలో ప్రోటీన్లు ఎంత మోతాదులో ఉండాలో తెలుసుకుంటే మంచిది. ఆరోగ్యంగా ఉన్న పెద్దలు తమ శరీర బరువులో ఒక కిలోగ్రాముకు 0.75 నుంచి 0.80 గ్రాముల (ఒక గ్రాము కంటే తక్కువే) ప్రోటీన్లు తీసుకోవాలనేది నిపుణుల అభిప్రాయం. సుమారుగా చెప్పాలంటే రోజుకు పురుషులైతే 55 గ్రాములు, స్త్రీలు 45 గ్రాముల ప్రోటీన్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. అయితే వయసు, లింగం, శారీరక శ్రమ, ఆరోగ్య స్థితి మీద ఈ లెక్క ఆధారపడి ఉంటుంది. అథ్లెట్లు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవాళ్లు వైద్యుల సూచన మేరకు వారికి తగిన మోతాదులో ప్రోటీన్లు తీసుకోవాలి.

ఇక రోజువారీగా ప్రోటీన్ల ద్వారా 10 నుంచి 35 శాతం క్యాలరీలు లభించాలి. ఈ మోతాదు దాటితే ఊబకాయం, కిడ్నీ సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ మధ్యకాలంలో ప్రోటీన్ పదార్థాలు, సప్లిమెంట్ల వాడకం కూడా పెరిగింది. ముఖ్యంగా యువతరంలో ఈ ధోరణి కనిపిస్తుంది. అయితే, నిపుణుల సూచన లేకుండా ప్రోటీన్ సప్లిమెంట్లు వాడకూడదు.



సరైన మోతాదులో తీసుకోకపోతే శరీరంలో ఎలక్ట్రోలైట్ అసమతుల్యత, కిడ్నీ సమస్యలు, కండరాల సమస్యలు, మలబద్ధకం, జీవక్రియలకు సంబంధించిన ఇబ్బందులు తలెత్తుతాయి.

కాబట్టి ప్రోటీన్ సప్లిమెంట్ల మీద ఆధారపడే బదులు రోజువారీ ఆహారం నుంచే తగినన్ని ప్రోటీన్లు దొరికేలా చూసుకోవాలి. తాజా కూరగాయలు, పండ్లు, గింజలు, చిక్కుడు జాతి గింజలు, టోఫు, సోయాబీన్, చేపలు, పాల ఉత్పత్తులు, ముతక ధాన్యాలు ప్రోటీన్ల గనులు. మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆరోగ్యంగా ఉండొచ్చు.

# ఫామ్‌లోకి వచ్చేందుకు డొమెస్టిక్ క్రికెట్ బెస్ట్ : యువరాజ్ సింగ్

స్పోర్ట్స్ న్యూస్ ,16 జనవరి (క్రాంతి న్యూస్ ):ఫామ్‌లో లేని ఆటగాళ్లు ఏ ఎత్తులో ఉన్నా.. దేశవాళీ క్రికెట్ ఆడాలని భారత మాజీ బ్యాట్స్‌మెన్ యువరాజ్ సింగ్ సూచించాడు.




న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టుల్లో టీమిండియా ఘోర పరాజయం పాలైంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరూ పేలవమైన ఆటతీరుతో విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఇద్దరి ఆటగాళ్లను దేశవాళీ క్రికెట్ ఆడాలని పలువురు మాజీలు సూచించారు. ఈ క్రమంలోనే యువరాజ్ సింగ్ ఫామ్ లేక ఇబ్బందిపడుతుంటే, సమయం ఉంటే ఖచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలని తాను భావించానని సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ప్రారంభ కార్యక్రమంలో పేర్కొన్నాడు.ప్రాక్టీస్‌కు ఇద్దే ఉత్తమమైన మార్గమని పేర్కొన్నారు. సమయం ఉంటే.. ఎలాంటి గాయపడకపోయి ఉంటే దేశవాళీ క్రికెట్ కీలకమైందని తాను భావిస్తున్నానని తెలిపాడు. సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, హెడ్‌కోచ్ గంభీర్ డొమెస్టిక్ క్రికెట్ ప్రాధాన్యతను వివరించారు. జనవరి 23న మొదలయ్యే రంజీ ట్రోఫీ మ్యాచులకు ముందు రోహిత్ శర్మ ముంబయి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటున్నాడు. ఢిల్లీ తరఫున విరాట్ కోహ్లీ ఆడతాడా? లేదా? ఇంకా ఎలాంటి హింట్స్ ఇవ్వలేదు. రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, శుభ్‌మాన్ గిల్ తదితర ఇతర స్టార్ ఆటగాళ్లు తమ జట్ల తరఫున ఆడేందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా సిడ్నీ టెస్టు సందర్భంగా రోహిత్ శర్మ తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి యువరాజ్ ప్రశంసించాడు. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఓటమి తర్వాత గంభీర్ కోచింగ్ సామర్థ్యంపై విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో ఇద్దరినీ యూవీ వెనకేసుకువచ్చాడు. భారత్ సిరీస్‌లు గెలిస్తే ప్రశంసిస్తారని.. ఓడిపోతే విమర్శిస్తారన్నారు. తాను మాత్రం ఎప్పుడూ ఐదేళ్ల నుంచి మూడేళ్ల కాలంలో జట్టు గ్రాఫ్‌ని చూస్తానని చెప్పాడు. గంభీర్ ఇప్పుడే వచ్చాడని.. అతనికి మరింత సమయం కావాలనిని చెప్పాడు. రోహిత్ కెప్టెన్‌గా టీ20 ప్రపంచకప్‌ను సాధించాడని.. వన్డేల్లో ఫైనల్ వరకు తీసుకువెళ్లగలిగాడని తెలిపాడు. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిల్స్ కట్టబెట్టినట్లుగా గుర్తు చేశారు. సిడ్నీ టెస్టుకు దూరంగా ఉండి మరొకరికి చాన్స్ ఇచ్చాడని.. గతంలో ఈ పని ఎందరు కెప్టెన్లు చేశారో తనకు చెప్పాలన్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0-3 తేడాతో ఓటమిని జీర్ణించుకోవడం కష్టమని యూవీ పునరుద్ఘాటించాడు.

# పీఆర్ ఏజెన్సీలను బ్యాన్ చేయాలి.. బీసీసీఐకి హర్షా భోగ్లే రిక్వెస్ట్..!



స్పోర్ట్స్ న్యూస్ ,16 జనవరి (క్రాంతి న్యూస్ ):వరుస ఓటములు భారత క్రికెటర్లకు ఇబ్బందికరంగా మారాయి. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైంది. ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లోనూ ఓటమిపాలైంది. అంతకు ముందు శ్రీలంకలో వన్డే సిరీస్‌లోనూ ఓటడిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆటగాళ్లపై బీసీసీఐ ఆగ్రహంగా ఉన్నది. ఈ క్రమంలో కొత్తగా కఠిన నియమాలను ఆంక్షలను అమలులోకి తీసువచ్చే అవకాశం ఉన్నది. విదేశీ పర్యటనలో ఆటగాళ్లు కుటుంబాలతో ఎంజాయ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, తమ కుటుంబాలతో గడిపే సమయాన్ని బీసీసీఐ పరిమితం చేయనున్నది.కుటుంబీకులు 45 రోజుల పర్యటనలో 14 రోజుల కంటే ఎక్కువ సమయం గడిపేందుకు అవకాశం ఇవ్వబోవడం లేదని తెలుస్తున్నది. అలాగే, టోర్నీ అంతకంటే తక్కువగా ఉంటే.. వారానికే అనుమతి ఉంటుంది. అదే సమయంలో టీమ్ ప్రయాణ సమయంలో రూల్స్‌ను తీసుకువచ్చింది. అలాగే, జట్టు ప్రయాణం విషయంలోనూ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. జట్టు ఒకేసారి ప్రయాణించాలని.. వేర్వేరుగా ప్రయాణించేందుకు అనుమతి ఇవ్వడం లేదని సమాచారం. భారత క్రికెట్‌లో రోజు రోజుకు చోటు చేసుకుంటున్న పరిణామాలపై ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందించారు. బీసీసీఐ కొత్తగా అమలు చేస్తున్న రూల్స్ బాగానే ఉన్నప్పటికీ.. పీఆర్ ఏజెన్సీలను నిషేధించాలని ఆయన బీసీసీఐకి సూచించారు. బీసీసీఐ భారత క్రికెట్‌లో చేస్తున్న మార్పుల గురించి చదివేందుకు బాగానే ఉందని.. కానీ, వాటిని ఎంత వరకు నమ్మాలో తనకు తెలియదన్నారు.అయితే, ఓ రూల్‌పై తప్పనిసరిగా చెప్పాలనుకుంటున్నానన్నారు. ఒక వేళ వర్తింపజేయాల్సి వస్తే.. ఆటగాళ్ల పీఆర్ ఏజెన్సీలు లేకుండా నిషేధించాలన్నారు. హర్ష భోగ్లే చేసిన కామెంట్స్‌లో కొంత వరకు వాస్తవం ఉన్నది. సోషల్ మీడియాలో ఆటగాళ్ల పీఆర్ ఏజెన్సీల హవా కొనసాగుతుంది. ఎవరైనా విమర్శిస్తే అభిమానుల పేరుతో పీఆర్ ఏజెన్సీలు వారిని ట్రోల్స్ చేస్తుంటాయి. ఏదైనా సిరీస్‌లో ఎవరైనా క్రికెటర్ విఫలమైతే.. వారిని ఎవరైనా విమర్శిస్తే.. జట్టులో నుంచి తప్పించకుండా గతంలో సాధించిన రికార్డులను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. ఈ తాజాగా హర్షా భోగ్లే చేసిన వ్యాఖ్యలు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్..?

స్పోర్ట్స్ న్యూస్ ,16 జనవరి (క్రాంతి న్యూస్ ): ఇంగ్లాండ్‌తో జరిగే పరిమితి ఓవర్ల సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా సౌరాష్ట్ర మాజీ బ్యాట్స్‌మెన్ సితాన్షు కొటక్ నియామకం దాదాపు ఖరారైంది. ప్రస్తుతం ఆయన ఇండియా-ఏ జట్టు హెడ్‌కోచ్‌గా ఉన్నారు. ఆయన పర్యవేక్షణలోనే ఇండియా-ఏ జట్టును గతేడాది నవంబర్‌లో పర్యటించింది. రాహుల్ ద్రవిడ్ అందుబాటులో లేకపోవడంతో ఆగస్టులో 2023లో ఐర్లాండ్‌లో పర్యటించిన భారత జట్టుకు హెడ్‌కోచ్‌గా వ్యవహరించారు. భారత జట్టు త్వరలోనే కీలకమైన సిరీస్‌లను ఆడనున్నది. ఈ నేపథ్యంలో సితాన్షు కొటక్‌ను కోచ్‌గా నియమించాలని బీసీసీఐ నిర్ణయానికి వచ్చినట్లు తెస్తున్నది. వాస్తవానికి న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లలో భారత జట్టును ఓటమి పాలైంది.

ఆయా సిరీస్‌లలో భారత బ్యాట్స్‌మెన్స్ బ్యాటింగ్స్‌లో విఫలమయ్యారు. 52 సంవత్సరాల సితాన్షు కొటక్ చాలాకాలం పాటు నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నారు. సీనియర్ జట్టుతో పాటు ఏ జట్లతో ఆయన విదేశీ పర్యటనలకు వెళ్లారు. ప్రస్తుత అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌పై పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా బీసీసీఐకి చెందిన ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం ఆటగాళ్లకు అభిషేక్ నాయర్ నుంచి ఎలాంటి సహాయం అందడం లేదని తెలుస్తుందని.. సితాన్షు చాలాకాలంగా బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నారని.. ఆయనపై ఆటగాళ్లకు నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భారత బ్యాట్స్‌మెన్ లోపాలు బయటపడ్డాయి. విరాట్ కోహ్లీ ఆఫ్ స్టంప్ వెలుపల వెళ్లే బంతులను వెంటాడి వికెట్‌ను సమర్పించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ లోపాలను సరిచేసేందుకు ఓ బ్యాటింగ్ కోచ్ అవసరమని బీసీసీఐ భావించినట్లు తెస్తున్నది.

ఈ నెల 22 నుంచి ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ జనవరి 22 నుంచి భారత జట్టు ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచుల టీ20 సిరీస్, మూడు వన్డేల సిరీస్ ఆడనున్నది. ఈ సిరీస్‌కు ముందు టీమిండియాకు కొత్త బ్యాటింగ్ కోచ్‌ను నియమించనున్నది. దాంతో భారత ఆటగాళ్ల ప్రదర్శన మెరుగుపడుతుందని భావిస్తున్నట్లుగా భావిస్తున్నారు. ఆ తర్వాత టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయికి వెళ్తుంది. ఈ ఐసీసీ ఈవెంట్ ఫిబ్రవరి 19 నుంచి మొదలుకానున్నది. ఇటీవల బీసీసీఐ బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో ఓటమి సందర్భంగా గతవారం సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ భేటీకి హాజరైన కెప్టెన్ రోహిత్ శర్మ.. జట్టుకు బ్యాటింగ్ కోచ్‌ను నియమించాలని కోరినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సితాన్షు కోటక్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించాలని బీసీసీఐ భావిస్తున్నట్లుగా తెలుస్తున్నది.



### ఎవరీ సితాన్షు కొటక్..?

సితాన్షు సౌరాష్ట్రకు చెందిన చెందిన మాజీ ఆటగాడు. గతేడాది నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్-ఏ జట్టుకు హెడ్ కోచ్‌గా సేవలందించారు. 1992-93 వరకు సౌరాష్ట్ర తరఫున దేశవాళీ క్రికెట్ ఆడారు. 130 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 8,061 పరుగులు చేయగా.. ఇందులో 15 సెంచరీలు, మరో 55 హాఫ్ సెంచరీలున్నాయి. ఆయన 41.76 యావరేజ్‌తో పరుగులు చేశారు. సౌరాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా చేశారు. రిటైర్మెంట్ తర్వాత కోచ్ అవతారం ఎత్తారు. సౌరాష్ట్ర హెడ్ కోచ్‌గా చేసి ఆ తర్వాత.. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్‌గా చేశారు. నాలుగేళ్లుగా ఇండియా-ఏ జట్టు హెడ్‌కోచ్‌గా సేవలందిస్తున్నారు. బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాకు పర్యటనల్లో భారత్-ఏ జట్టు కోచ్‌గా వ్యవహరించారు. ఐపీఎల్ 2017లో గుజరాత్ లయన్స్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా పని చేశారు. గత టీ20 వరల్డ్ కప్ అనంతరం టీమిండియా హెడ్‌కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత గౌతమ్ గంభీర్ బాధ్యతలు స్వీకరించాడు. అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోషేట్ సహాయక కోచ్‌లుగా, మోర్నే మోర్కెల్ బౌలింగ్ కోచ్‌గా నియామకమయ్యాడు. టీ దిలీప్ ఫీల్డింగ్ కోచ్‌గా ఎంపికైన విషయం తెలిసిందే.



# సినిమా న్యూస్

## అజిత్ 'విడాముయర్చి' తెలుగు టైటిల్ ఇదే.!

మూవీ న్యూస్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): తమిళ అగ్ర నటుడు అజిత్ ప్రస్తుతం కార్ రేసింగ్ పోటీల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా దుబాయ్‌లో జరిగిన కార్ రేసింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి సత్తాచాటింది అజిత్ రేసింగ్ జట్టు. దీంతో నటుడిగానే కాకుండా రేసర్‌గా రాణించిన అజిత్‌పై ప్రశంసలు కురిపించారు ప్రముఖులు. ఇదిలావుంటే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి' ఏకే 62గా వస్తున్న ఈ సినిమాకు మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. అయితే ఈ సినిమాను తెలుగులో పట్టుదల పేరుతో విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ని నేడు 6.40 నిమిషాలకి జెమిని టీవీ వేదికగా లాంఛ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఎంత వాడు గాని తర్వాత అజిత్– త్రిష కాంబినేషన్‌లో ఈ సినిమా రానుండటంతో మూవీ భారీ అంచనాలు ఉన్నాయి.




## తమిళ, కన్నడలో అవకాశాలు




మూవీ న్యూస్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): 'బేబీ' చిత్రం కథానాయిక వైష్ణవి చైతన్య కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ సినిమాలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది. ప్రస్తుతం సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటూ కథాబలమున్న చిత్రాలనే అంగీకరిస్తున్నది వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఈ భామ తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ సరసన 'జాక్' చిత్రంలో నటిస్తున్నది. మరికొన్ని పెద్ద చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరికి తమిళం, కన్నడ ఇండస్ట్రీల నుంచి కూడా భారీ ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది.అక్కడ రెండు చిత్రాలకు ఆమె సైన్ చేశారని సమాచారం. ఈ ఏడాది తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో కూడా మంచి విజయాలను సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నది వైష్ణవి చైతన్య. సోషల్‌మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో తన సినిమాలకు సంబంధించిన విశేషాలను పంచుకుంటుంది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ కొత్త ఏడాది నటిగా తనను మరో మెట్టెక్కిస్తుందనే నమ్మకంతో ఉంది వైష్ణవి .

## 'లైలా' ప్రేమలీలలు

మూవీ న్యూస్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): యువ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. ఈ సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్‌లో విశ్వక్‌సేన్ అమ్మాయి పాత్రలో కనిపించనున్నారు. సంక్రాంతి సందర్భంగా విశ్వక్‌సేన్ లేడీ గెటప్‌లోని కొత్త స్టిల్‌ను విడుదల చేశారు.

ఇందులో ఆయన అచ్చు అమ్మాయిలా కనిపిస్తున్నారు. లేడీ గెటప్‌లోని సన్నివేశాలు చక్కటి హాస్యాన్ని పండిస్తాయని చిత్ర బృందం చెబుతున్నది. లైలా పాత్రలో విశ్వక్‌సేన్ నటన ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తుందని, ఆయన కెరీర్‌లో ఇదొక వైవిధ్యభరితమైన చిత్రమని మేకర్స్ తెలిపారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 17న విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, దర్శకత్వం: రామ్ నారాయణ్.




## వెన్నెల కిషోర్ నా వారసత్వాన్ని కొనసాగిస్తాడు : బ్రహ్మానందం

మూవీ న్యూస్,16 జనవరి (క్రాంతి న్యూస్ ): బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బ్రహ్మ ఆనందం' . వెన్నెల కిషోర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్వకత్వం వహిస్తున్న ఈ సినిమాను స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ చిత్రం.నేడు ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. అయితే ఈ టీజర్ వేడుకలో బ్రహ్మీ మాట్లాడుతూ.. ఈ మధ్య మొహం చూడగానే నవ్వు తెప్పించే వారిలో వెన్నెల కిషోర్ ఉన్నాడు. వెన్నెల కిషోర్ తెరపై కనిపిస్తే చాలు ఆటోమేటిక్‌గా నవ్వు వస్తుంది. నా వారసత్వాన్ని కొనసాగించే వారిలలో వెన్నెల కిషోర్ ఒక్కడు. అంతా సరదాగా నటిస్తాడు కిషోర్ అంటూ బ్రహ్మీ చెప్పుకోచ్చాడు.



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com